ప్రజాశక్తి

ఆదివారం 21 ఏప్రిల్ 2024 | 8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

గూడు చెదిరింది... కుటుంబం రోడ్డు పాలైంది...

- ఇంటి స్లాబు కూలి ఐదుగురికి గాయాలు
- నిలువ నీడలేని బాధిత కుటుంబ సభ్యులు
- ఆదుకోని ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - విజయవాడ

విధి వంచింది...ఓ కుటుంబం రోడ్డున పండింది...కానీ ఆదరించాల్సిన ప్రభుత్వం మానవత్వం మరచింది...దీంతో ఓ కుటుంబం గూడు చెదిరి అనుభవిస్తున్న వేదన చూస్తే ఎవరికైనా కళ్లు చెమర్చక మానదు. వివరాల్లో వెళితే.... ఈనెల 17వ తేదీ ఉదయం 11 గంటల సమయంలో విజయవాడ గిరిపురం గాస్పెల్ చర్చి సమీపంలో నివాసం ఉంటున్న దళిత మహిళ ఇత్తడి స్వర్ణ ఇంటి స్లాబ్ పూర్తిగా కూలిపోయింది. కానీ అదృష్టవశాత్తూ ఇంట్లోని ఐదుగురూ ప్రాణాపాయం నుండి బయటపడినా గాయాలకు గురయ్యారు. శిథిలావస్థలో ఉన్న ఈ ఇంట్లో ఇత్తడి స్వర్ణ చిన్న కుమార్తె అశ్వనీ, ఆమె ఇద్దరు కుమారులు అగస్టీన్, హేమచంద్ర, స్వర్ణ రెండో కుమార్తె నిరుపమకు చెందిన ఇద్దరు కుమార్తెలు హిమలత, అక్షితలు భోజనం చేసేందుకు సిద్ధమవుతున్న సమయంలో ఒక్కసారిగా స్లాబ్ కూలి వారిపై పడింది. దీంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. తల, చేతులు, వీపుపై బలమైన దెబ్బలు తగిలాయి. తలకు గాయమైన హిమలతకు తొమ్మిది కుట్లు పడ్డాయి. అశ్వనీ నుదిటిపై కూడా మూడు కుట్లు పడ్డాయి. అలాగే నిరుపమ (మిగతా 2లో)

బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు డిమాండ్
- బాధితులతో కలిసి ఆందోళన
- గిరిపురంలో శిథిలావస్థకు చేరిన ఇళ్లకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి

వార్త 2లో

మందకొడిగా నామినేషన్లు

ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల్లో మొత్తం 36 దాఖలు

ప్రజాశక్తి - విజయవాడ, కలెక్టరేట్ (కృష్ణా) : ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల్లో శనివారం మొత్తం 336 నామినేషన్లు దాఖలయ్యాయి. ఎన్‌టిఆర్ జిల్లాలో 23, కృష్ణాజిల్లాలో 13 నామినేషన్ల అభ్యర్థులు సమర్పించార. ఎన్‌టిఆర్ జిల్లాలో మూడో రోజున శనివారం మొత్తం 23 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గానికి ఒకరు, జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు 22 మంది అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేశారు. విజయవాడ పార్లమెంట్‌కు స్వతంత్ర అభ్యర్థిగా మద్దినేని అనిల్ కుమార్ ఒక సెట్ నామినేషన్ సమర్పించారు. విజయవాడ పశ్చిమ అసెంబ్లీకి ఐదుగురు నామినేషన్లు వేశారు. వీరిలో జై భీమ్‌రావ్ భారత్ పార్టీ అభ్యర్థిగా పరసా సురేష్ కుమార్, తెలుగు రాజాధికార సమితి పార్టీ అభ్యర్థిగా జగదీష్ రామచంద్రరావు, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నక్కల సాయిబాబు, స్వతంత్ర అభ్యర్థులుగా బొబ్బిలి లక్ష్మి, షేక్ రబ్బాని ఒక్కో సెట్ నామినేషన్లు దాఖలు చేశారు. విజయవాడ సెంట్రల్‌కు ఏడు నామినేషన్లు దాఖలయ్యాయి. వీరిలో స్వతంత్ర అభ్యర్థులు కొణిజేటి ఆదినారాయణ, మన్నం రాజశేఖర్, బొప్పన గాంధీ ఒక ఒక్కో సెట్ నామినేషన్లు దాఖలు చేశారు. టిడిపి అభ్యర్థిగా బోండా ఉమామహేశ్వరరావు, సోషలిస్టు యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా పార్టీ అభ్యర్థిగా ఎల్ హిమ వద్వతి, జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా శ్రీధర దక్షిణా మూర్తి, (మిగతా 2లో)

విజయవాడ పార్లమెంట్‌కు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్.[redacted] స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ అందిస్తున్న మద్దినేని అనిల్ కుమార్

నేడు యుపిఎస్‌సి పరీక్షలు

హాజరుకానున్న 1,872 మంది అభ్యర్థులు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఈనెల 21న జరిగే యుపిఎస్‌సి పరీక్షలను లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీ రావు అధికారులను ఆదేశించారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపిఎస్‌సి) నిర్వహించే పరీక్షల ఏర్పాట్లపై కలెక్టరేట్లో వెన్యూ సూపర్వైజర్లు, లైజన్ కం ఇన్‌స్పెక్టింగ్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆదివారం నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌టిఎ), నేవల్ అకాడమీ (ఎన్ఎ), సిడీఎస్ (కంబైండ్ డిఫెన్స్ సర్వీస్) పరీక్షలను యుపిఎస్‌సి నిర్వహించనుందని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 1,872 మంది ఈ పరీక్షలకు హాజరుకానున్నారని, ఇందుకు ఐదు పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశామని చెప్పారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నావెల్ అకాడమీ పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.00 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ పరీక్షలు ఉదయం 9.00 నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 12 నుంచి 2.00 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం ఐదుగురు రూటు అధికారులతోపాటు ఐదుగురు లైజన్ అధికారులను నియమించినట్లు చెప్పారు. ఇప్పటికే పరీక్షా పత్రాలను స్ట్రాంగ్ రూములలో భద్రపరచినట్లు తెలిపారు. సకాలంలో పరీక్షా పత్రాలు కేంద్రాలకు చేరుకునేలా రూటు అధికారులు చర్యలు తీసుకోవాలని, అలాగే పోలీస్, తపాలా, వైద్య ఆరోగ్యం, ఏపీఈపిడిసిఎల్, జీవిఎంసి తదితర శాఖలు వారికి అప్పగించిన విధులను తూచ తప్పకుండా పాటించాలని చెప్పారు. వేసవిని దష్టిలో ఉంచుకొని తాగునీరు, విద్యుత్ అంతరాయం లేకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలగరాదని, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈసమావేశంలో వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, లైజన్ అధికారులు, పోలీస్, తపాలా, వైద్య ఆరోగ్యం, ఏపీఈపిడిసిఎల్, జీవిఎంసి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

22, 23 తేదీల్లో గురుకులాల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి - విజయవాడ : ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకులాల్లో మిగిలిన సీట్లకు ఈనెల 22, 23 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల సమన్వయ అధికారి బి.సుమిత్రా దేవి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కష్ణాజిల్లాలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులాల్లో 2024-25 విద్యా సంవత్సరంలో 5వ తరగతిలో చేరేందుకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పరీక్షలో మెరిట్ ప్రకారం ఇప్పటికే మొదటి జాబితాలో సీట్లు కేటాయించగా, మిగిలిన సీట్లకు బాలురుకు ఈనెల 22న పామర్రులోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే బాలికలకు ఈనెల 23న వీరపనేనిగూడెంలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు కేటాయించనున్నట్లు వెల్లడించారు. ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రాతిపదికన నిర్వహించే కౌన్సెలింగ్‌కు మెరిట్ జాబితా ప్రకారం విద్యార్థులకు మొబైల్ మెసేజ్ ద్వారా సమాచారమిచ్చినట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే కౌన్సెలింగ్‌కు (మిగతా 2లో)

నెల రోజుల ముఖ్యమంత్రి

రాజ'కీ'యం మొదలైంది విజయవాడ నుంచే..

కథనం మధ్య పేజీలో

ఎన్‌టిఆర్ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్‌గా శుభం నోఖ్వాల్

ప్రజాశక్తి - విజయవాడ

ఎన్టీఆర్ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్‌గా 2023 బ్యాచ్‌కు చెందిన శుభం నోఖ్వాల్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టరు కార్యాలయంలో కలెక్టర్ ఎస్.డిల్లీరావును మర్యాదపూర్వకంగా కలిశారు.

నేడు మాంసం దుకాణాలు బంద్

ప్రజాశక్తి - విజయవాడ

మహావీర్ జయంతి సందర్భంగా ఆదివారం కబేళాకు సెలవు ప్రకటించినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని కబేళాలు, మాంసం దుకాణాలను మూసివేయాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించి మాంసం విక్రయించే దుకాణ యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

చంద్రబాబు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - గన్నవరం

తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు జన్మదినం సందర్భంగా స్థానిక నాయకులు ఏర్పాటు చేసిన 75 కిలోల కేకును యార్లగడ్డ కట్ చేశారు. చంద్రబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు డిమాండ్
- బాధితులతో కలిసి ఆందోళన
- గిరిపురంలో శిథిలావస్థకు చేరిన ఇళ్లకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి - విజయవాడ : గిరిపురంలో కూలిపోయిన దళిత మహిళ స్వర్ణ ఇంటిని శనివారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు సందర్శించారు. గాయపడిన వారిని పరామర్శించి ధైర్యం చెప్పారు. బాధితులతో మాట్లాడారు. అనంతరం వారితో కలిసి ఆందోళన చేపట్టారు. సమస్యను అధికారుల దష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ 1982లో ప్రభుత్వ సహాయంతో నిర్మించిన ఇళ్లు ప్రస్తుతం క్షీణ దశలో ఉన్నాయన్నారు. వందలాది దళితుల ఇళ్లు కూలిపోవటానికి సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. దళిత మహిళ ఇల్లు కూలిపోయి నాలుగు రోజులైనా అధికారులు. ప్రజాప్రతినిధులు తొంగి చూడకపోవడం శోచనీయమన్నారు. బాధితులకు సరైన వైద్యం అందలేదన్నారు. కుట్లు వేసి పంపివేశారని తెలిపారు. ఇల్లు కోల్పోయి ప్రత్యామ్నాయం లేక, రోడ్లపైనే జీవనం సాగించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వందలాదిమంది నివసిస్తున్న గిరిపురంలోని దళితుల ఇళ్లకు ఎన్ని ప్రభుత్వాలు మారినా రిజిస్ట్రేషన్ చేయలేదన్నారు. దెబ్బతిన్న ఇళ్లను పునర్నిర్మించడానికి నిధులు మంజూరు చేయలేదని విమర్శించారు. ఎన్నికల్లో మాత్రం వీరిని పాలక పార్టీలు వినియోగించుకుంటున్నాయని వివరించారు. ప్రస్తుత వైసిపి ప్రభుత్వం దళితుల ఉద్ధరణ గురించి కబుర్లు చెప్పడమే తప్ప, చేసింది ఏమీలేదన్నారు. ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదని విమర్శించారు. తక్షణమే ప్రభుత్వం, అధికారులు స్పందించి ఇంటి పునర్నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి తక్షణం పునరావాసం కల్పించాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని, తక్షణ ఆర్థిక సాయంగా రూ.50 వేలు అందించాలని కోరారు. గిరిపురంలోని అన్ని ఇళ్ల పునర్నిర్మాణానికి అందరికీ రూ.10 లక్షల చొప్పున సాయం అందించాలని, ఇళ్లకు రిజిస్ట్రేషన్‌కు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఆందోళనలో బాదితులతోపాటు సిపిఎం నేతలు జి.క్రాంతి, గురుమూర్తి , బెనర్జీ, కె.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

22, 23 తేదీల్లో గురుకులాల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్

(మొదటి పేజీ తరువాయి)

ఉదయం 9 గంటలకల్లా హాజరు కావాలని, పూర్తి సమాచారానికి బాలికలు 9704550069, బాలురు 7032703753 నంబరులో సంప్రదించొచ్చని సుమిత్రా దేవి సూచించారు.

వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండల పరిధిలోని మద్దులపర్వ గ్రామంలో టిడిపికి 30 కుటుంబాలకు చెందిన వారు వైసిపిలో చేరినట్లు జడ్‌పిటిసి సభ్యులు పాలంకి విజయ భాస్కర్‌రెడ్డి, వైసిపి నాయకులు పాలంకి సురేష్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలంకి రమణారెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు చాట్ల రామారావు (యేసు), మాజీ సర్పంచ్ కోమటి కృష్ణ, మాజీ ఎంపిటిసి కొలుసు గంగాధర్, మాజీ వైస్ సర్పంచ్ బొమ్మిన సత్యనారాయణ, తొర్లికొండ వెంకట రమణ, కేదాసు శివయ్య, దాసరి గురవయ్య తదితరులు పాల్గొన్నారు. జగ్గయ్యపేట: పట్టణంలోని ఆర్టీసీ కాలనీకి చెందిన సయ్యద్ నాగుల్ మీరా, సయ్యద్ అబ్దులా శనివారం తెలుగుదేశం పార్టీని వీడి ప్రభుత్వవిప్, శాసనసభ్యులు సామినేని ఉదయభాను,యువనాయకులు సామినేని వెంకట కష్ణ ప్రసాద్ బాబు సమక్షంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

టిడిపి అభ్యర్థి యార్లగడ్డ ప్రచారం

ప్రజాశక్తి - గన్నవరం : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గడపగడపకు ప్రజాగళం పేరుతో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎన్డీయే కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు శనివారం గన్నవరం నియోజకవర్గ కేంద్రమైన గన్నవరం టౌన్ లోని హరిజనవాడలో విస్తతంగా పర్యటించారు. గడపగడపకు వెళ్లి ప్రజల కష్టాలను తెలుసుకుంటూ రాబోయే ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రజలకు అందిచనున్న సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన దష్టికి వచ్చిన త్రాగునీరు సమస్య, నిత్యావసరాల ధరల పెరుగుదల, డ్రైనేజీ నిర్మాణాలు లేకపోవడం, నిరుద్యోగం తదితర సమస్యలను ప్రభుత్వం వచ్చిన వెంటనే పరిష్కరిస్తామని స్థానిక ప్రజలకు హామీ ఇచ్చారు.

IN THE COURT OF THE HON□BLE CIVIL JUDGE(JUNIOR DIVISION) AT VUYYURU
I.A.No.556/2023 IN O.S.No.5 /2015

Between:
Anne Ratna Kumari ...Petitioner/Plaintiff
And
1. Kadiyala Parasu Ramaiah(died)
2. Kadiyala Dhana Lakshmi
3. Kadiyala Venkateswara Rao
4. Vemulapalli Sujatha
..... Respondents/Defendants

To
R.4 Vemulapalli Sujatha, W/o. Phanidra Babu, Hindu, aged about 38 years, R/o. China Ogirala village, Vuyyuru Mandal, Krishna District.

పై I.A.No.556/2023 in O.S.No. 5/2015లో రెస్పాండెంట్ నెం.4 అయిన మీ హాజరు నిమిత్తం ది. 16-07-2024వ తేదీన వాయిదాఅయివున్నది. కావున మీరు ది. 16-07-2024 ఉదయం గం.10-30లకు స్వయముగా గాని, లేక మీ వకీలుగారి ద్వారా గాని పై తెల్పిన కోర్టు వారి యెదుట హాజరుకావలసినదిగా తెలియచేయడమైనది.

(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది : 16-07-2024న
ఉయ్యూరు,
ది..20-04-2024

పులి కేశవబాబు, బి.ఎ., యల్.యల్.బి.,
పులి నాగవర్థన్ బాబు, బి.ఎ., యల్.యల్.బి.,
అడ్వకేట్స్, పామర్రు
సెల్ : 9885588730

IN THE COURT OF THE HON□BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT SATHUPALLY.
O.S. No. 99/2021

Between:
Gunja Padma .... Plaintiff
And
Bonthu Jyothi @ Vallepu Jyothi
.... Defendant No.8

పై కేసులో ప్రతివాది నె.8 అయిన బొంతు జ్యోతి @ వల్లెపు జ్యోతి, భర్త : గోపి, ఆర్/ఓ, వాగుసెంటర్, దుక్కా తిరుపతమ్మ వీధి, 48వ వార్డు, విజయవాడ, ఎన్టీఆర్ జిల్లా. గారి హాజరు నిమిత్తం ది. 26-4-2024వ తేదీన వాయిదా కలదు. ఆ రోజు ఉదయం 10-30 గం.లకు పై కోర్టులో పిలిచినప్పుడు హాజరు కావలెను. లేనియెడల పై కేసులో వారి యొక్క పరోక్షములో తీర్మానించబడునని వారికి ఇందుమూలంగా తెలియపరచడమైనది.

(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

జె.వి.నరేంద్ర, బి.ఎ., ఎల్ఎల్‌బి.,
అడ్వకేట్,
సత్తుపల్లి - 507303.
ఖమ్మం జిల్లా, తెలంగాణా రాష్ట్రం.

మొదటి పేజీ తరువాయి

గన్నవరం వైసిపి అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న వల్లభనేని వంశీమోహన్

మందకొడిగా నామినేషన్లు

నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మలపోగు ప్రశాంత్ కుమార్ ఒక్కో సెట్ నామినేషన్లు దాఖలు చేశారు. విజయవాడ తూర్పు అసెంబ్లీకి ముగ్గురు అభ్యర్థులు ఐదు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియాకు చెందిన గొట్లూరి శివ నాగ లక్ష్మి, జై భారత్ నేషనల్ పార్టీకి చెందిన యనుమల మురళి కృష్ణ నాయుడు, ఒక్కో సెట్, నవరంగ్ కాంగ్రెస్ పార్టీకి చెందిన జల్ది అనిల్ కుమార్ మూడు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. మైలవరం అసెంబ్లీకి ముగ్గురు అభ్యర్థులు నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో వైసిపికి చెందిన సర్నాల తిరుపతిరావు, ౦ండు సెట్ల నామినేషన్లలను, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గుడిస రాంబాబు, తెలుగు రాజాధికార సమితి పార్టీ అభ్యర్థిగా చింతమల నవీన్ అబేద్కర్ ఒక్కో సెట్ నామినేషన్లు దాఖలు చేశారు. నందిగామ అసెంబ్లీకి బై భీమ్ రావ్ భారత్ పార్టీ అభ్యర్థిగా బెజవాడ గోపి ఒక సెట్ నామినేషన్ వేశారు.

సెంట్రల్ నియోజకవర్గంలో నామినేషన్ వేస్తున్న అభ్యర్థి

తిరువూరు అసెంబ్లీకి ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా, వీరిలో బిఎస్‌పి అభ్యర్థులుగా లక్కెపోగు వందన్‌కుమార్, గంగవరపు శామ్యూల్ దేవసహాయం, స్వతంత్ర అభ్యర్థిగా లాము ప్రసన్న కుమార్ ఒక్కో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. జగ్గయ్యపేట అసెంబ్లీకి ఎవరూ నామినేషన్ దాఖలు చేయలేదు. ఈ మేరకు జిల్లా ఎన్నికల అధికారి ఎస్.డిల్లీరావు ఒక ప్రకటన విడుదల చేశారు.

కృష్ణాలో 13 నామినేషన్లు

కృష్ణాజిల్లాలో మూడో రోజు శనివారం మొత్తం 13 నామినేషన్లు దాఖలయ్యాయి. మచిలీపట్నం పార్లమెంటు స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా అంబళ్ల రాజ్‌కుమార్ ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. గన్నవరం అసెంబ్లీకి స్వతంత్ర అభ్యర్థిగా బళ్లాని హరీష్, బిఎస్‌పి తరపున సింహాద్రి రాఘవేంద్రరావు, వైసిపి తరపున వల్లభనేని వంశీ మోహన్, వల్లభనేని పంకజశ్రీ, గుడివాడ అసెంబ్లీకి బిఎస్‌పి తరపున గుడివాడ బోసుబాబు ఒక్కో సెట్ చొప్పున నామినేషన్లు వేశారు. పెడన అసెంబ్లీకి స్వతంత్ర అభ్యర్థిగా సమ్మెట వెంకన్నబాబు రెండు సెట్లు, మచిలీపట్నం అసెంబ్లీకి స్వతంత్ర అభ్యర్థిగా అరిఫ్ పాషా షేక్ రెండు సెట్లు, స్వతంత్ర అభ్యర్థిగా లక్ష్మీ కిరణ్ కూనపరెడ్డి ఒక సెట్, పామర్రు అసెంబ్లీకి జాతీయ జనసేన పార్టీ తరపున సాలె దినేష్‌బాబు ఒక సెట్, పెనమలూరు అసెంబ్లీకి పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరపున చుక్కా ఏడుకొండలు ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు.

గూడు చెదిరింది... కుటుంబ రోడ్డు పాలైంది...

చిన్న కుమార్తె అక్షిత తలపై బలమైన గాయం కావడంతో ఆమెకూ కుట్లు వేశారు. అశ్వనీ కుమారులైన అగస్టీన్, హేమచంద్రకు స్వల్ప గాయాలయ్యాయి. ఇంటి స్లాబ్ పడిన సమయంలో ఏ మాత్రం అప్రమత్తంగా లేకపోయినా అందరూ మృత్యువాత పడేవారు. ఇదే విషయాన్ని బాధితురాలు అశ్వని బోరున విలపిస్తూ చెప్పింది. కనురెప్ప మూసి తెరిచే వ్యవధిలో ఇంట్లో నుంచి అంతా బయటకు రావడంతో బతికిబట్టకట్టారు. రోజు మాదిరిగా తాను పనికి వెళ్లినా, రాత్రి సమయంలో ఈ సంఘటన జరిగినా అందరూ మృత్యువాత పడేవారమని తెలిపింది. తాను పనికి వెళ్లకపోవడం, పగలు సంఘటన జరగడంతో బతికిపోయామని పేర్కొంది. స్లాబ్ పడే సమయంలో అందరినీ బయటకు లాగేశానని వివరించింది.

గాయాలు ఒకవైపు...నిలువ నీడలేక మరోవైపు...

ప్రమాదం జరిగి ఇప్పటికి నాలుగు రోజులైనా బాధిత కుటుంబ సభ్యులకు నిలువ నీడలేకుండా పోయింది. రోడ్డుపక్కన, చెట్ల కింద తలదాచుకుంటున్నారు. శిధిలావస్థకు చేరిన 15 గజాల స్థలంలోని ఇల్లు దెబ్బతినిపోయింది. దీంతో కనీసంగా ఉండటానికి వీలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గాయాలపాలైన పిల్లలకు కనీసం భోజనం వండి పెట్టడానికి వసతి కూడా లేకుండా పోయింది. పొరుగిళ్ల వారు వారొక ముద్ద...వీరొక ముద్ద పెడుతుంటే పిల్లలు కడుపు నింపుకుంటున్నారు. అప్పుడప్పుడు పస్తులుండాల్సి వస్తోంది. ఈనెల 17న శ్రీరామ నవమి కావడంతో పిల్లలకు సెలవులని తన కుమార్తె, అల్లుడుతోపాటు పిల్లలిద్దరూ ఇంటికొచ్చారని, వారొచ్చిన కొద్ది సమయానికే ప్రమాదం జరిగిందని ఇంటి యజమానురాలు స్వర్ణ తెలిపింది. ఏ ఒక్క ప్రజాప్రతినిధిగానీ, స్థానిక కార్పొరేటర్‌గానీ, అధికారులు ఇటు కన్నెత్తి కూడా చూడలేదని తీవ్రంగా గాయపడిన అశ్వనీ రోధిస్తూ చెప్పింది. తన తల్లి స్వర్ణ ఏలూరు రోడ్డులోని షాపుల్లో స్వీపర్‌గా పని చేస్తుందని, ఆ వచ్చే కొద్దిపాటి డబ్బులపై ఆధారపడాల్సి వస్తోందని అశ్వనీ తెలిపింది. ఉన్న ఈ కొద్ది పాటి ఇల్లు కూడా దెబ్బతిని ఎటువంటి ఆధారం లేక రోడ్ల పక్కనే కాలం గడుపుతున్నామని ఆవేదన వ్యక్తం చేసింది. తమను ఆదుకోవాలని ఆ కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.

మహారాజశ్రీ ఒంగోలు ప్రిన్సిపల్ జిల్లా జడ్జి వారి కోర్టులో
డి.ఓ.పి 37/22

ఎలికా కాశయ్య ...పిటిషనరు
వర్సెస్
ఎలికా @ గోనుగుంట్ల సలోమి ...రెస్పాండెంట్

To
ఎలికా @ గోనుగుంట్ల సలోమి, భర్త కాశయ్య
D/O ఇజ్రాయిల్, డోర్ నెంబర్ 16/12,
శాంతా నగర్, కానూరు (మండలం) కృష్ణా జిల్లా

పై నెంబర్ నందు పిటిషనరు మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచుండుట చేత మీకు పేపర్ పబ్లికేషన్ ద్వారా నోటీసు జారీ చేయు నిమిత్తం తేది 03.05.2024కి వాయిదా వేసినారు. కావున ఆ రోజున ఉదయం 10.30 గంటలకు మీరు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని పై కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది లేని యెడల మీ పరోక్షమునందు తీర్మానించబడునని ఇందు మూలముగా మీకు తెలియజెయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఇట్లు
కాటుకూరి బాబురావు
M.A., B.L, న్యాయవాది
గోల్డెన్ టవర్స్, సెకండ్ ఫ్లోర్,
జిల్లా కోర్టు ఎదురు, ఒంగోలు
Cell : 9989623971

యథేచ్ఛగా ఆక్రమణలు... మట్టి తరలింపు

ఎనుమల్లి మురుగు కాల్వను కిలోమీటర్ పొడవునా గట్ల తొలగించిన దృశ్యం

ప్రజాశక్తి-పెడన: పెడనలో ఎంతో విలువైన డ్రైనేజీ భూములు అన్యాకాంతమైపోతున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడంతో మట్టి మాఫియా పెట్రేగిపోతుంది. కిందిస్థాయి అధికారి, సిబ్బంది చేతివాటం కారణంగా ఎంత విలువైన ప్రభుత్వ భూములు రోజురోజుకు అంతరించిపోతున్నాయి. మరోవైపు ఉన్నతాధికారులు ఎన్నికల విధుల్లో నిమగ్నం అవడంతో సందట్లో సడేమియా అన్నచందంగా అక్రమార్కులు తమ పని మరింత అనుకూలంగా కొనసాగిస్తున్నారు. మండల పరిధిలోని పాత బల్లిపర్రు శ్మశానవాటక వద్ద ఉన్న రెవెన్యూ భూమిని, కొంకేపూడి పంచాయతీ శివారు కట్టపల్లిలోని లజ్జబండ డ్రైనేజీ కాలువ గట్లను ఆక్రమించి వీటిలోని మట్టిని తవ్వి లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై ఉన్నతాధికారులు కిందిస్థాయి సిబ్బందికి వాటి గురించి విచారించాలని ఆదేశాలు జారీ చేశారు. దీనిపై స్పందించిన సిబ్బంది అక్రమంగా తవ్వుతున్న చెరువులు, డ్రైనేజీ గట్ల మట్టిని తరలించడం నిలిపివేశామని, అంతేకాకుండా గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ నౌకరు చేత టామ్‌టామ్ వేయించామని చెప్పారు. దీనిని ఆసరాగా తీసుకున్న మరో బడాబాబు ఇంకో అడుగు ముందుకేసి

కట్టపల్లిలో లజ్జబండ డ్రైనేజీ గట్లు తొలగించిన దృశ్యం

ఏకంగా దిరిసేవల్లి గ్రామంలో పెనుమల్లి వైపు వెళ్లే మురుగు కాలువ గట్లను కిలోమీటర్ పొడవునా మట్టిని తరలించారు. ఈ మట్టిని పెడనలోని గృహ సముదాయాలకు, ఇటుకరాయి తయారు చేసే బట్టీదారులకు అమ్మకాలు చేసినట్లుగా ఆయా గ్రామాల్లోని ప్రజలు ఆరోపిస్తున్నారు. డ్రైనేజీ భూముల గట్టు ఏకంగా కిలోమీటర్ల పొడవునా వందలాది ట్రక్కుల మట్టిని తరలిస్తున్న విషయాన్ని స్థానికులు డ్రైనేజీ శాఖ అధికారులకు చెప్పినా ఫలితం లేదని వాపోతున్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి వడ్డాదికి మద్దతు

ప్రజాశక్తి-గుడివాడ : ఇండియా వేదిక బలపరిచిన గుడివాడ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వడ్డాది గోవిదరావు (రాజేష్)కు వామపక్ష నాయకులు ఆర్‌సిపి రెడ్డి, గూడపాటి ప్రకాష్‌బాబులు పూర్తి మద్దతు తెలిపారు. శనివారం స్థానిక అంజనేయపేటలోని సిపిఎం కార్యాలయంలో ఇండియా వేదిక నాయకుల సమీక్షా సమావేశం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు శిష్ట్లా దత్తాత్రేయులు, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వడ్డాది రాజేష్‌లు పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా మహిళ కార్యదర్శి నిశ్చల, ఐద్వా కార్యదర్శి రజని, నాయకులు రేపాని కొండ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరం

ప్రజాశక్తి-చల్లపల్లి: ప్రపంచ దేశాల్లో అంధత్వ నిర్మూలన ధ్యేయంగా లయన్స్ క్లబ్ కషి చేస్తోందని లయన్స్ క్లబ్ ఆఫ్ చల్లపల్లి వీ.ఆర్.కే నగర్ అధ్యక్షులు మోపిదేవి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం చల్లపల్లి కోమలా నగరులోని క్లబ్ కార్యాలయంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. కంటి వైద్యులు వెంకట్రావు 50మందికి కంటి పరీక్షలు చేసి 12 మందిని కంటి శుక్లముల ఆపరేషన్ కోసం ఎంపిక చేశారు. లయన్స్ క్లబ్ జిల్లా నాయకులు నర్రా సాయిబాబు తన సతీమణి నర్రా రమాదేవి ద్వితీయ వర్ధంతి సందర్భంగా అందించిన ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని క్లబ్ మాజీ అధ్యక్షులు ఏ.ఎల్.ఆర్.కే ప్రసాద్, క్లబ్ కార్యదర్శి రాయపాటి రాధాకష్ణ పర్యవేక్షించారు.

మాచవరంలో కలుషిత నీరు సరఫరా



ప్రజాశక్తి-కోడూరు: కోడూరు మండల పరిధిలోని మాచవరం గ్రామానికి గత నెల రోజులుగా వారానికి రెండు రోజులు మాత్రమే అది కూడా వారికి ఇష్టమైన సమయాల్లో ప్రజలకు పంచాయతీ నీరు సరఫరా చేస్తున్నారు. గతంలో మాచవరం గ్రామ శివారు మోదుమూడి గ్రామంలో ఆనుకొని ఒక బోరు ఏర్పాటు చేసి ఆ బోరు నీటిని మాచవరం గ్రామానికి ప్రతిరోజు విడుదల చేసేవారు. గత నెల రోజులుగా ఆ నీటిని సరిగ్గా సప్లై చేయకుండా సాగునీటి కోసం ప్రభుత్వం విడుదల చేసిన కాలువలోని నీటిని ఎటువంటి శుద్ధి చేయకుండా డైరెక్ట్‌గా కుళాయిల ద్వారా ప్రజలకు పంపిస్తున్నారు. ఆ నీటిని కూడా మూడు నాలుగు రోజులకు ఒకసారి విడుదల చేస్తున్నారు వాటి వల్ల ప్రజలు ఎలర్జీలు వంటి అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారని తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని పంచాయతీ నీటి సప్లయర్స్‌కి, పంచాయతీ సర్పంచ్ కి, కార్యదర్శికి పలుమార్లు గ్రామస్తులు తెలియజేసిన పట్టించుకోవడంలేదని మాచవరం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని తక్షణమే శుద్ధిచేసిన మంచినీటిని గ్రామ ప్రజలకు విడుదల చేసి ప్రజలు అనారోగ్య బారిన పడకుండా కాపాడాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు.

25 మందికి కంటి పరీక్షలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: స్థానిక లయన్స్ సేవా భవనంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు క్లబ్ అధ్యక్షులు బొర్రా నాగేశ్వరరావు తెలిపారు. ఈ శిబిరంలో 25 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా ఐదుగురికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ముగ్గురికి ఆపరేషన్లకు వైద్యులు సిఫారసు చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి చలసాని శ్రీధర్ పాల్గొన్నారు.

25న ఉద్యోగుల రాష్ట్ర కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈ నెల 25 న విజయవాడ మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే రాష్ట్ర కౌన్సిల్ సమావేశాన్ని జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్ష,ప్రదానా కార్యదర్శులు పి.రాము, తోట వర ప్రసాద్ తెలిపారు. 'భజనతో కాదు బాధ్యతతో, పార్టీలతో కాదు- ప్రభుత్వంతో' అనే నినాదంతో పనిచేస్తున్న ఐక్యవేదికను మరింత బలోపేతం చేయడానికి ప్రతి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు కషిచేయాల్సిన అవసరాన్ని తెలియచేస్తూ విజయవాడలో జరుగబోవు ఐక్యవేదిక రాష్ట్ర కౌన్సిల్ సమావేశానికి హాజరై మన హక్కుల కోసం పనిచేసే ఒక మంచి వేదికకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ప్రధాన డిమాండ్లు చర్చించడం జరుగుతుందని, కాబట్టి ఉద్యోగులందరూ పెద్ద ఎత్తున పాల్గొని రాష్ట్ర కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయలని కోరారు.



కాంగ్రెస్ అభ్యర్థి నాగరాజుకు బి ఫారం

ప్రజాశక్తి-పెడన: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిల చేతుల మీదుగా పెడన నియోజకవర్గ పార్టీ అభ్యర్థి సొంటి నాగరాజు శనివారం బి ఫారం తీసుకున్నారు. గెలుపే లక్ష్యంగా పని చేస్తానని ఈ సందర్భంగా షర్మిలకు వివరించినట్లు ఆయన చెప్పారు. ఇందుకు వామపక్ష పార్టీలు, అలాగే పార్టీ సీనియర్ నాయకులు కలుపుకుని ముందుకు వెళతానని వివరించారు.

ఎన్నికల సిబ్బందికి వసతులు నిల్

ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం నియోజకవర్గ ఎన్నికల కార్యాలయానికి ఎన్నికల పనుల నిమిత్తం వస్తున్న సిబ్బంది సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. భోజనం పెట్టకపోవడంతో ఆకలితో అలమటిస్తున్నారు. బాపులపాడు, విజయవాడ రూరల్ మండలం, ఉంగుటూరు, గన్నవరం మండలాలు ఎన్నికల కార్యాలయం పరిధిలో ఉన్నాయి. ఎన్నికల పనుల నిమిత్తం రోజు 50 నుంచి 70 మంది గన్నవరం (రెవెన్యూ) కార్యాలయానికి వస్తున్నారు. వీరందరికీ ఉదయం టిఫిన్లు, మధ్యాహ్నం భోజనం వసతి కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. చల్లటి మంచినీటిని కూడా అందుబాటులో ఉంచాలి. అందుకోసం ఎన్నికల సంఘం నుంచి లక్షల రూపాయలు బడ్జెట్ కేటాయింపు జరిగింది. గన్నవరం తాహసిల్దార్ ఈ బడ్జెట్ను ఖర్చు పెడుతూ ఉంటారు. అయితే ఎన్నికల పనులు ప్రారంభమై నెల రోజులు గడుస్తోంది. ఇంకో నెల రోజులు ఉంటాయి. అయితే ఇక్కడకు వస్తున్న సిబ్బంది వారి సొంత డబ్బులు ఖర్చు పెట్టుకుని అవసరాలు తీర్చుకుంటున్నారు. డబ్బులు ఖర్చు పెట్టకుంటే ఆకలితో మాడాల్సిందే. అదేమని గట్టిగా అధికారిని అడగలేని పరిస్థితి. అయితే ఎన్నికల ఖర్చు పేరుతో కార్యాలయంలోని ఆర్ఐ ఒకరు మండలమంతా డబ్బులు వసూలు చేసే పని చేపట్టారని విమర్శలు ఉన్నాయి. కంపెనీల నుంచి రాజకీయ నాయకుల నుంచి డబ్బు వసూలు చేసే పని ఆయన చేపట్టినట్లు తెలుస్తోంది. సూరంపల్లిలోని ఓ కంపెనీ యజమాని దగ్గరకు వెళ్లి లక్షల రూపాయలు డిమాండ్ చేయడం, దానిపై వారు గొడవ చేసినట్లు తెలిసింది. అయితే ఆర్ఐ మాత్రం ఎన్నికల ఖర్చు కోసం అధికారి వసూలు చేయమన్నారని చెప్పడం గమనార్హం. ఈ క్రమంలో ఎన్నికల బడ్జెట్ ఎవరి జేబుల్లోకి వెళుతుందనేది ప్రశ్నగా మారింది. ఈ విషయమై నియోజకవర్గస్థాయి ఎన్నికల అధికారి రంగంలోకి దిగి తగిన చర్యలు చేపట్టాలని సిబ్బంది కోరుతున్నారు.

లయన్స్ క్లబ్ జోన్ చైర్‌పర్సన్‌గా ఇస్మాయిల్

ప్రజాశక్తి-ఉయ్యూరు

లయన్స్ క్లబ్ జోన్ చైర్‌పర్సన్‌గా ఉయ్యూరుకు చెందిన ఎండి ఇస్మాయిల్ నియమితులయ్యారు. ఉయ్యూరు లయన్స్ క్లబ్ అధ్యక్షునిగా పని చేస్తున్న ఇస్మాయిల్ జోన్ చైర్పర్సన్ గా బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ ఎం కన్వెన్షన్లో శుక్రవారం జరిగిన నూతన కార్యవర్గ ఎంపిక కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధి లయన్స్ జిల్లా క్యాబినేట్ నూతన గవర్నర్గా బాధ్యతలు స్వీకరించిన గద్దె శేషగిరిరావు ఇస్మాయిల్‌కు బాధ్యత ు అప్పగించారు. లయన్స్ జిల్లా 316డిలోని రీజియన్-1 పరిధిలో ఉన్న జోన్-2కు ఇస్మాయిల్ చైర్పర్సన్‌గా వ్యవహరించనున్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్: అగ్ని ప్రమాదాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక శాఖ అధికారి గరికపాటి రామ్మోహన్రావు అన్నారు.మండల కేంద్రమైన బాపులపాడులోని అగ్నిమాపక కేంద్రం వద్ద అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు, తాసిల్దార్ కార్యాలయం సిబ్బందికి శనివారం అవగాహన సదస్సు ఏర్పాటు చేసి కరపత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఫైర్‌ఆఫీసర్ రామ్మోహన్ రావు మాట్లాడుతూ అగ్ని ప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు అగ్నిమాపక సిబ్బంది సాహసోపేతమైన చర్యలు ప్రశంసనీయమన్నారు. అగ్నిమాపక వారోత్సవాలు వారం రోజుల పాటు జరుగుతాయని, పెట్రోలు, బంకులు, పాఠశాలలు, అపార్టుమెంటులు పరిశ్రమలు ఉన్న ప్రాంతాల్లో అవగాహన కల్పిస్తామన్నారు. అగ్నిప్రమాదాల్లో ప్రాణ, ఆస్తినష్టం వాటిల్లకుండా అగ్నిపమాక సిబ్బంది కృషి చేస్తున్నట్లు తెలిపారు.ఎక్కడైనా అగ్నిప్రమాదాలు సంభవిస్తే, వెంటనే అప్రమత్తమై నష్ట నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం అగ్నిమాపక పరికరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో లీడింగ్ ఫైర్మెన్ సం జీవ్ కుమార్, డీఓపీ సాంబశివరావు, ఫైర్మెన్ మురళి, శ్యాంబాబు, కృష్ణసాగర్, నాగార్జున, దుర్గాప్రసాద్, అబ్దులై తదితరులు పాల్గొన్నారు.

23న నాంచారమ్మ జాతర

ప్రజాశక్తి-కోడూరు: విశ్వనాధపల్లి గ్రామం కృష్ణానది తీరాన కొలువై ఉన్న శ్రీ అద్దంకి నాంచారమ్మ అమ్మవారి నెల జాతర మహోత్సవం ఈ నెల 23న బుధవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో సిహెచ్ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. జాతరకు వచ్చే యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

చిరువ్యాపారికి చెక్కు అందజేత

ప్రజాశక్తి-గుడివాడ : పండ్ల వర్తక సంఘం సభ్యులు, చిరు వ్యాపారి ఆది మల్లేశ్వరరావు అనారోగ్యంతో ఇటీవల మరణించడంతో ప్రధానమంత్రి జీవన్ జ్యోతి భీమా యోజన పథకం కింద రెండు లక్షల చెక్కును గుడివాడ పోస్టల్ శాఖ అధికారులు పండ్ల వర్తక సంఘ నాయకులతో కలిసి బాధిత కుటుంబానికి అందజేశారు. శనివారం స్థానిక వర్తక సంఘం కార్యాలయంలో పోస్టల్ అధికారులు ఐపిపిబి మేనేజర్ గణేష్, గుడివాడ సబ్ డివిజన్ పోస్టల్ ఇన్స్పెక్టర్ వి.లక్ష్మి కిషోర్, వర్తక సంఘం అధ్యక్షుడు గోకరకొండ బలరాం చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీ నుండి జివిఆర్ వెల్ఫేర్ సొసైటీ తరపున వైట్ రేషన్ కార్డు ఉన్నవారికి కేంద్ర ప్రభుత్వ ఈ శ్రమ్ దరఖాస్తులను ఉచితంగా అందచేస్తామని ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ శాఖ అధికారులు బిహెచ్ సత్యశ్రీ, ఎన్.శ్రీనివాస్, పండ్ల వర్తక సంఘం నాయకులు పెద్ది రమణ, పెద్ది కిషోర్, పిడుగు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
కృష్ణాజిల్లా
ఆదివారం
21 ఏప్రిల్ 2024

తీర్పు-2024

కవి గళం

ఓటు సందేశం

ఓటు సందేశం
దేశమంటే మట్టి కాదు
ఎన్నికలంటే...
పైసలకో ప్రలోభాలకో లోనై
క్యూ కట్టి నొక్కే యంత్రపు మీట కాదు

ప్రజాస్వామ్య విలువలకై
ప్రజాహితం కోరే నేతను
నిజాయితీగా ఎన్నుకొనే
పవిత్ర సన్నివేశం అది

మంచికి ఓటేద్దాం

ఓటు...
మన అభివృద్ధికి భరోసా
ఆత్మవిశ్వాసానికి ప్రతీక
రాజ్యాంగం మనకిచ్చిన
అరుదైన కానుక

ఊకదంపుడు వాగ్దానాలు ప్రకటించి
మాయమాటలు మంత్రాల్లా జపించి
అమాయకులకు అతడిచ్చే పచ్చనోటు
నీతి నియమాలకు పెద్దచేటు
ప్రజాస్వామ్యానికది వెన్నుపోటు

మంచికి ఓటేద్దాం
చదును తరిమేద్దాం
ఓటే బ్రహ్మాస్త్రం
ఓటే స్కడ్ మిసైలూ
ఓటే కల్పవృక్షం
ఓటే కామధేనువు

ఓటు హక్కును వినియోగించుకుందాం
మన పాలకుడిని మనం ఎంచుకుందాం
శిథిలమైన కలల సౌధాలకు
కొత్త పునాదులు వేద్దాం..!

ప్రజా సమస్యలు పట్టని నేతలను తిరస్కరించండి

సిపిఎం గన్నవరం అభ్యర్థి కళ్లం వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-గన్నవరం: ఎన్నికల్లో ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించుకోవడం ద్వారానే ప్రజా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని సిపిఎం గన్నవరం నియోజకవర్గ అభ్యర్థి కళ్లం వెంకటేశ్వరరావు అన్నారు. గన్నవరం మండలం బుద్ధవరం పంచాయతీ పరిధిలోని దావాజీగూడెం గ్రామంలో శనివారం ఆయన వామపక్ష నాయకులతో కలిసి విస్తృత ప్రచారం నిర్వహించారు. మహిళలను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసిపి, టిడిపి, జనసేన బిజెపికి తొత్తులుగా మారాయని, స్వార్థ ప్రయోజనాల కోసం బిజెపి బలపడటానికి ఆయా పార్టీల అధినేతలు తోడ్పడుతున్నారని విమర్శించారు. ఇలాంటి పార్టీలను ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఇండియా వేదిక తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులను గెలిపించుకోవాలని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎర్రజెండా పోరాటం చేస్తుందని, దానికి అందరూ అండగా నిలవాలని కోరారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ కార్పొరేట్లకు దాసోహం అంటున్నారని విమర్శించారు. మోదీ పాలనలో దేశం దివాళా తీసిందన్నారు. 375 పార్లమెంటు సీట్లు బిజెపికి ఇస్తే రాజ్యాంగాన్ని మార్చివేస్తారని తెలిపారు. రాజ్యాంగాన్ని మారిస్తే దేశంలో ప్రజాస్వామ్యం, లౌకికతత్వం ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. దావాజీగూడెం రమణమ్మ చెరువులో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని పోరాటం చేసి న్యాయం జరిగేలా చేసింది ఎర్రజెండా అని గుర్తు చేశారు. ఇంకా ఉన్న పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని పోరాటం చేసి జైలుకు వెళ్లామని తెలిపారు. రమణమ్మ చెరువులో సౌకర్యాల కల్పనకు బుద్ధవరం పంచాయతీ నుంచి సర్పంచ్ బడుగు బాలమ్మ కృషి చేస్తున్నారని ఆయన చెప్పారు. ఈ నెల 23వ తేదీన నామినేషన్ కార్యక్రమానికి వామపక్ష, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అభిమానులు, ప్రజలు తరలిరావాలని కోరారు. బుద్ధవరం సర్పంచ్ బడుగు బాలమ్మ మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నిరంకుశ పాలన కొనసాగిస్తోందని, ఈ పాలనకు రానున్న ఎన్నికల్లో ప్రజలు చరమగీతం పాడాలన్నారు. అనంతరం కళ్లం వెంకటేశ్వరరావు ఎన్నికల ఖర్చుకు బాలమ్మ ఒక నెల జీతం రూ.3 వేలు వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వామపక్ష నాయకులు మీరాఖాన్, మరియమ్మ, చినబాజీ, కొండా వీరాస్వామి, ఆరేపల్లి మోహనరావు, బడుగు మరియదాసు, ఆంజనేయులు, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

ప్రచార హోరు

సిపిఎంకు విరాళం అందజేస్తున్న బుద్ధవరం సర్పంచ్ బాలమ్మ

కృష్ణాలో 13 నామినేషన్లు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): కృష్ణాజిల్లాలో మూడో రోజు శనివారం మొత్తం 13 నామినేషన్లు దాఖలయ్యాయి. మచిలీపట్నం పార్లమెంటు స్థానానికి అంబళ్ల రాజ్‌కుమార్ స్వతంత్ర అభ్యర్థిగా ఒక సెట్ నామినేషన్ దాఖలు చేయగా, గన్నవరం అసెంబ్లీ స్థానానికి బళ్లాని హరీష్ స్వతంత్ర అభ్యర్థిగా ఒక సెట్ నామినేషన్, సింహాద్రి రాఘవేంద్రరావు బహుజన సమాజ్ పార్టీ తరపున ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారన్నారు. వల్లభనేని వంశీ మోహన్ వైసిపి తరపున ఒక సెట్ నామినేషన్, వల్లభనేని పంకజశ్రీ వైసిపి తరపున ఒక సెట్ నామినేషన్, గుడివాడ అసెంబ్లీ స్థానానికి బహుజన్ సమాజ్ పార్టీ తరపున గుడివాడ బోసుబాబు ఒక సెట్ నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. అలాగే పెడన అసెంబ్లీ స్థానానికి సమ్మెట వెంకన్నబాబు స్వతంత్ర అభ్యర్థిగా రెండు సెట్ల నామినేషన్లు, మచిలీపట్నం అసెంబ్లీ స్థానానికి అరిఫ్ పాషా షేక్ స్వతంత్ర అభ్యర్థిగా రెండు సెట్ల నామినేషన్లు, లక్ష్మీ కిరణ్ కూనపరెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా ఒక సెట్, పామర్రు అసెంబ్లీ స్థానానికి సాలె దినేష్‌బాబు జాతీయ జనసేన పార్టీ తరపున ఒక సెట్ నామినేషన్, పెనమలూరు అసెంబ్లీ స్థానానికి చుక్క ఏడుకొండలు పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరపున ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు.

వంశీ నామినేషన్

ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం నియోజకవర్గానికి సంబంధించి శనివారం నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. వైసిపి నుంచి వల్లభనేని వంశీ మోహన్, వల్లభనేని పంకజశ్రీ నామినేషన్లు వేశారు. ఇండిపెండెంట్‌గా బళ్లాని హరీష్, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా సింహాద్రి రాఘవేంద్రరావులు నామినేషన్ల సమర్పించారు. వంశీతో పాటు అనగాని రవి, శివ భరత్ రెడ్డి, నీలం బాలు, తిరువీధి రంగారావు ఉన్నారు. పంకజశ్రీతో పాటు ఏఎంసీ చైర్మన్ తోట కరుణ ఉన్నారు. 25వ తేదీన గన్నవరంలో భారీ ప్రదర్శన జరిపి మరోసారి నామినేషన్ దాఖలు చేస్తామని వంశీ తెలిపారు. **పెడన:** పెడన స్వతంత్ర అభ్యర్థిగా మండల పరిధిలోని బల్లిపరుగు చెందిన సమ్మెట వెంకన్న బాబు శనివారం నామినేషన్ దాఖలు చేశారు. రిటర్నింగ్ అధికారి పి.వెంకటరమణకు రెండు సెట్ల ధ్రువపత్రాలను అందజేశారు. **హనుమాన్ జంక్షన్:** మచిలీపట్నం పార్లమెంట్ స్థానానికి ఇండిపెండెంట్ అభ్యర్థిగా గన్నవరం నియోజకవర్గం బాపులపాడు మండలం పెరికీడు గ్రామానికి చెందిన అంబళ్ల రాజకుమార్ మచిలీపట్నంలో శనివారం నామినేషన్ దాఖలు చేశారు. తన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీకి సమర్పించారు.

ర్యాలీ నిర్వహిస్తున్న వల్లభనేని వంశీ

ఓటు వినియోగానికి 11 గుర్తింపు కార్డులు

మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఓటరు కార్డు లేని వారు 11 రకాల గుర్తింపు కార్డుల ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల పిఎస్‌యులు, పబ్లిక్ కంపెనీలు ఉద్యోగులకు జారీ చేసే ఫొటో గల సర్వీసు గుర్తింపు కార్డులు, బ్యాంకులు, పోస్టాఫీసులు జారీ చేసిన ఫొటో గల పాస్ బుక్‌లు, పాన్ కార్డు, ఎన్‌పిఆర్ కింద ఆర్‌జిఐ జారీ చేసిన స్మార్ట్ కార్డు, ఉపాధి హామీ చట్టం జాబ్ కార్డు, కార్మిక మంత్రిత్వ పథకంలో జారీ చేసిన ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డు, ఫోర్‌మో పింఛను పథకం, ఎంపిలు, ఎంఎల్‌ఏలు, ఎంఎల్‌సిలకు జారీ చేసిన అధికారి గుర్తింపు కార్డులు, ఆధార్ కార్డు ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవచ్చు.

ఇండియా వేదికతోనే ప్రజాస్వామ్యానికి మనుగడ

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్: ఇండియా వేదిక అభ్యర్థుల గెలుపు ద్వారానే ప్రజాస్వామ్య మనుగడ సాధ్యమని, ఎన్నికల్లో మతతత్వ బిజెపిని ఓడించి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని పలువురు నాయకులు అన్నారు. శనివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండియా వేదిక అభ్యర్థి అబ్దుల్ మతిన్ మాట్లాడుతూ మత విద్వేషాలతో రెచ్చగొట్టే బిజెపిని గద్దె దించాలన్నారు. ఆంధ్ర రాష్ట్రానికి మోడీ ప్రభుత్వం ప్రత్యేక హోదా ఇవ్వలేదని ఆయన అన్నారు. కేంద్రంలోని బిజెపి రాక్షస పాలన సాగిస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ దగ్గర జనసేన, టిడిపి, వైసిపి తొత్తులుగా మారాయని విమర్శించారు. సిపిఎం నాయకులు కొడాలి శర్మ మాట్లాడుతూ భిన్న మతాలు, కులాలు ఉన్న భారతదేశాన్ని మతం రంగు పులిమి మత తత్వాన్ని రెచ్చగొట్టి లబ్ధిపొందాలని మోడీ చూస్తున్నారని, దీన్ని తిప్పికొట్టాలని అన్నారు. ఇప్పటివరకు దేశంలో అనేక పరిశ్రమలు మూతపడి లక్షల మంది ఉద్యోగాలు పోయి అయోమయ పరిస్థితిలో ఉన్నారని చెప్పారు. మచిలీపట్నంలో మంచినీళ్ల సరఫరా సక్రమంగా జరగడంలేదని, ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపిస్తే మోపిదేవి మండలంలోని బండికోళ్లలంక వద్ద డ్యాం నిర్మించి సాగు, తాగు నీటికి ఇబ్బంది లేకుండా చేయవచ్చన్నారు. సిపిఐ నాయకులు మోదుమూడి రామారావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బురా సుబ్రహ్మణ్యం, సిహెచ్ జయరావు, సిహెచ్ రాజేష్, ఎండి యూనస్, ఐసిపిఐ నాయకులు లింగం ఫిలిప్, మోదుమూడి నాగరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు చంద్రశేఖర్, చీలుకోటి ప్రసాద్, కుమారి, రజీనా బేగం, సామ్యూల్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఇండియా వేదిక నాయకులు

నెల రోజుల ముఖ్యమంత్రి

రాజ'కీ'యం మొదలైంది బెజవాడ నుంచే..

ఫ్లాష్ బ్యాక్

రాష్ట్రంలో అతి తక్కువ కాలం ముఖ్యమంత్రిగా వ్యవహరించి అనేక సంచలనాలకు కారణమైన నాదెండ్ల భాస్కరావు రాజకీయం మొదలైంది విజయవాడ నుంచే. వృత్తి రీత్యా న్యాయవాది అయిన ఆయన 1978లో ఇందిరా కాంగ్రెస్ అభ్యర్థిగా తూర్పు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో రాష్ట్రంలో ఇందిరా కాంగ్రెస్ అధికారం చేపట్టింది. చెన్నారెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన మంత్రివర్గంలో నాదెండ్ల మంత్రి అయ్యారు. తర్వాత ఏర్పడిన అంజయ్య మంత్రివర్గంలో ఆయన కేబినెట్ మంత్రి అయ్యారు. అయితే ప్రఖ్యాత చలనచిత్ర నటుడు ఎన్‌టి రామారావు 1982 మార్చి 29న ఏర్పాటు చేసిన తెలుగుదేశం పార్టీలో ఆయన చేరారు. అప్పుడాయన విజయవాడ తూర్పు ఎమ్మెల్యేగానే ఉన్నారు. 1983 జనవరిలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం సాధించింది. ఆయన విజయవాడ నుంచి గుంటూరు జిల్లా వేమూరుకు మారారు. అక్కడ నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా విజయం సాధించారు. ఎన్‌టి రామారావు ముఖ్యమంత్రిగా ఏర్పడిన కొలువులో నాదెండ్ల ఆర్థిక మంత్రి అయ్యారు. సరిగ్గా ఏడాది గడిచాక ఆయన సంచలనానికి కేంద్ర బిందువయ్యారు. ఎన్‌టిఆర్ గుండె ఆపరేషన్ చేయించుకునేందుకు అమెరికా వెళ్లి ఆగస్టు 14న తిరిగివచ్చారు. అప్పటికి తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు కొందరు కాంగ్రెస్‌తో చేతులు కలపడం, లేదా కాంగ్రెస్ పార్టీయే తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలను తమకు అనుకూలంగా లాగేసుకోవడం వంటి వ్యవహారాలు నడుస్తున్నాయి. ఆనాటికి నాదెండ్ల ప్రతిపక్ష కాంగ్రెస్‌తో చేతులు కలిపి వారి ఎమ్మెల్యేలతోనూ, తెలుగుదేశం పార్టీని చీల్చి వారిలో కొందరి ఎమ్మెల్యేల మద్దతుతోనూ ఆగస్టు 16న ముఖ్యమంత్రిగా పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. "ప్రజాస్వామ్య తెలుగుదేశం పార్టీ"ని ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వ సూచలనతో గవర్నర్‌గా ఉన్న రామ్‌లాల్ ఈ వ్యవహారం సజావుగా సాగడానికి తోడ్పడ్డారు. నాదెండ్ల ప్రమాణ స్వీకారానికి ముందు ఎన్‌టి రామారావు తనకు 163 మంది సభ్యుల బలం ఉందని వారి జాబితాను గవర్నర్‌కు పంపినా వినకుండా అప్రజాస్వామికంగా నాదెండ్లను ముఖ్యమంత్రిని చేశారు.

దీనిపై రాష్ట్రవ్యాప్తంగా ప్రజాస్వామ్య పునరుద్ధరణ ఉద్యమం ప్రారంభమైంది. సిపిఎం, సిపిఐ వంటి పార్టీలు ప్రజాస్వామ్య పునరుద్ధరణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించాయి. నెల రోజులపాటు రాష్ట్రం మొత్తంగా అవిశ్రాంత ఉద్యమాలతో కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చింది. అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ సూచనలతో తిరిగి గవర్నర్ రామ్‌లాల్.. నాదెండ్ల ప్రభుత్వాన్ని తొలగించి మళ్లీ ఎన్‌టి రామారావు ప్రభుత్వాన్ని సెప్టెంబరు 16న పునఃప్రతిష్టించారు. ఈ విధంగా నాదెండ్ల నెల రోజులపాటు ముఖ్యమంత్రిగా పనిచేశారు. "ఏక్ దిన్‌కా సుల్తాన్" మాదిరిగా అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లో నెల రోజులపాటు ముఖ్యమంత్రి బాధ్యతలు నిర్వహించిన వ్యక్తి నాదెండ్ల భాస్కరరావే.

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ సమయంలో ఆయన విజయవాడ నుంచే ముఖ్య బాధ్యతలు నిర్వహించారు. 1984 ఆగస్టు సంక్షోభంపై నాదెండ్ల "నేను ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచాననడం చాలా తప్పు. ఆయనే నన్ను వెన్నుపోటు పొడిచారు. తనకున్న పొలిటికల్ స్కిల్, ఎన్టీఆర్ చరిష్మా కారణంగానే 1983లో మేం కాంగ్రెస్‌ను పడగొట్టాం. ఆ మాటకొస్తే నామూలంగానే టిడిపి పుట్టింది" అని ఓ న్యూస్ ఛానల్ వద్ద సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇందులో ఎంత వాస్తవం ఉందనే విషయంతో నిమిత్తం లేకుండా ఆయన తొలిగా ఎమ్మెల్యే అయింది విజయవాడ నుంచే. అందుకే చరిత్రపుటల్లో ఇదొక జ్ఞాపకం.

నామినేషన్ దాఖలుకు నియమావళి

మే 13న జరిగే పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికలకు సంబంధించి ఈనెల 18వ తేదీ నుండి నామినేషన్ల పర్వం ప్రారంభమైంది. ఈనెల 25వ తేదీ వరకూ ఇది కొనసాగుతుంది. అయితే నామినేషన్లు వేసే అభ్యర్థులు కొన్ని నియమాలను పాటించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారులు చెబుతున్నారు. వాటిని పరిశీలిస్తే...

1.నామినేషన్ వేసే ప్రతి అభ్యర్థి కాన్వాయ్‌లో మూడు వాహనాలకు మించి ఉండరాదు.
2.నామినేషన్ వేసేటప్పుడు అభ్యర్థితో కలిపి ఐదుగురికిగా మాత్రమే రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి అనుమతిస్తారు.
3.నామినేషన్ పత్రాలు తహశీల్దారు కార్యాలయంలో ఎన్నికల అ ధికారి నుండి పొందాలి
4.ఆఫీసు పని దినాల్లో ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే నామినేషన్లు స్వీకరిస్తారు.
5.నామినేషన్ పత్రాలు అభ్యర్థి లేదా ఎవరైనా ప్రతిపాదకుడు దాఖలు చేయవచ్చు.
6.ప్రతి అభ్యర్థి నాలుగు సెట్ల నామినేషన్ పేపర్లు దాఖలు చేయవచ్చు.



నామినేషన్ వేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

1.ఫారం నెంబర్ 2బి నామినేషన్‌తోపాటు ఫారం నెంబర్ 25లో అఫిడివిట్ దాఖలు చేయాలి.
2.ఫారం26లో అఫిడివిట్ కాలం తప్పని సరిగా నింపాలి. లేకపోతే ఆ నామినేషన్‌ను తిరస్కరిస్తారు.
3.నామినేషన్ దాఖలు చేసేటప్పుడు మాత్రమే సెక్యూరిటీ డిపాజిట్లు చెల్లిచాలి.
4.ప్రత్యేక బ్యాంకు అకౌంట్ తెరవాలి. నామినేషన్‌తోపాటు పాస్ బుక్ జిరాక్స్ ఇవ్వాలి.
5.ప్రతిపాదకుడు ఒకటి కంటే ఎక్కువగా నామినేషన్ పేపర్లపై సంతకాలు చేయొచ్చు.
6.అభ్యర్థి రూ.10 వేలు సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాలి.
7.ఏప్రిల్ 25వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు.
8.ఏప్రిల్ 26న నామినేషన్ల పరిశీలన జరుగుతుంది.
8.ఏప్రిల్ 28వ తేదీ మధ్యాహ్నం 3గంటలలోపు నామినేషన్ ఉపసంహరించుకోవచ్చు.
9.పోటీ చేసే అభ్యర్థిపై కేసులుంటే ఆవివరాలు తెలియజేయాలి.

32వ డివిజన్‌లో పర్యటిస్తున్న సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ నాయకులు

విజయవాడ అభివృద్ధికి బాబూరావును గెలిపించాలి

32వ డివిజన్ పర్యటనలో సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ నేతలు

ప్రజాశక్తి-విజయవాడ: నిర్లక్ష్యానికి గురైన విజయవాడ నగరం అభివృద్ధికి ఇండియా వేదిక బలపరిచిన సిపిఎం అభ్యర్థి సిహెచ్.బాబురావుకు ఓటు వేసి గెలిపించాలని పలువురు నాయకులు కోరారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని 32వ డివిజన్ లోటస్ ల్యాండ్ మార్క్, అయోధ్య నగర్ ప్రాంతంలో సిహెచ్.బాబురావుతో పాటు కాంగ్రెస్ రాష్ట్ర నేత, ప్రముఖ న్యాయవాది వి.గురునాధం, సిపిఐ నగర నాయకులు కెవి భాస్కరరావు, సిపిఎం సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి బి.రమణారావు తదితరులు శనివారం పర్యటించి ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా బాబూరావు, గురునాథం, భాస్కర్‌రావు మాట్లాడుతూ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిపై జరిగిన గులకరాయి దాడి చుట్టూతే వైసిపి, టిడిపి తిరుగుతున్నాయని, ప్రజా సమస్యల ఎజెండాను ఆ పార్టీలు గాలికి వదిలేశాయని విమర్శించారు. ఒకరిపై మరొకరు పరస్పర దూషణలు, దాడులతో వివాదాలు రెచ్చగొడుతున్నారన్నారు. ఎన్నికల్లో ఓట్ల కోసం, సానుభూతి కోసం ఈ పార్టీలు పేదలను, సామాన్యులను బలి చేస్తున్నాయన్నారు. మద్యం ఏరులై పారిస్తూ యువతను తప్పుదారి పట్టిస్తున్నారన్నారు. పరస్పర విమర్శలతో వాస్తవాలు మరుగున పడుతున్నాయని అన్నారు. దాడి, అరెస్టుల పేరుతో సానుభూతి పొంది ఓట్లు దండుకోవటానికి నేతలు ప్రయత్నించటం సిగ్గుచేటన్నారు. సరైన విచారణ జరగాలి, నిజమైన దోషులను శిక్షించాలి, అమాయకులపై వేధింపులు ఆగాలని డిమాండ్ చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం పేదలను బలిచేసే నేతలకు, పార్టీలకు ఈ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. నగరంలో ప్రశాంత వాతావరణాన్ని పరిరక్షించడానికి సిపిఎం, కమ్యూనిస్టులకు మద్దతునివ్వాలని కోరారు. విజయవాడ సెంట్రల్‌లో సిపిఎంకు ఓటు వేయాలని కోరారు. గతంలోనూ, నేడు ప్రజాప్రతినిధులుగా ఉంటూ వైసీపీ, టిడిపి నేతలు వివాదాలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకుంటున్నారని అన్నారు. అధికార దుర్వినియోగానికి, భూ కబ్జాలకు పాల్పడుతున్నారని అన్నారు. వ్యక్తిగత దూషణలతో ప్రజా ప్రతినిధుల స్థాయిని దిగజార్చుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పన్నులు వసూలు చేయడం తప్ప అభివృద్ధిని విస్మరించాయని పేర్కొన్నారు. పన్నుల భారాలతో సామాన్యులతో పాటు మధ్యతరగతి ప్రజలు కుంగిపోతున్నారని, వేధింపులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విజయవాడ నగరపాలక సంస్థ పాలకపక్షంగా ఉన్న నేతలు అవినీతికి పాల్పడుతూ ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తున్నారని అన్నారు. ప్రజల ఓట్లతో గద్దెనెక్కి అధికార దుర్వినియోగం చేస్తున్నారని అన్నారు. సిపిఎం బాబురావు ప్రజా సేవకు అంకితమై దశాబ్దాలుగా పని చేస్తున్నారని, పాలకులు 73 అక్రమ కేసులు మోపినా నిర్బంధాన్ని ఎదుర్కొంటూ ప్రజా ఉద్యమాల్లో ముందు పీఠిన నిలబడుతున్నారని అన్నారు. ఇటువంటి నేతను నగరం నుండి శాసనసభకు పంపి ప్రజల వాణిని అసెంబ్లీలో వినిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ నేతలు బోయి సత్యబాబు, డీబీకే రావు, సీతారామ రావమ్మ, సుందర రామరాజు, ప్రభుదాసు, రాజు, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల చిత్రాలు

అసలు అభ్యర్థి ఎవరో గుర్తుపట్టండి..!!

ఈ చిత్రంలో ఒకే పార్టీకి చెందిన, ఒకే రూపంలో ఉన్న ఐదుగురు అభ్యర్థులు ఉన్నారు ! వీరిలో అసలు అభ్యర్థి ఎవరో మీరు గుర్తుపట్టండి !! గుర్తుపట్టలేకపోతే మధ్యలో ఉన్న అభ్యర్థే అసలు. ఆయనే విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుండి ఇండియా వేదిక బలపరచిన సిపిఐ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పార్టీ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు. ఈ నెల 19వ తేదీన తన నామినేషన్ సందర్భంగా వినూత్నంగా నిర్వహించిన ర్యాలీలో ఆయన ఇలా ప్రత్యక్షమయ్యారు !!

నారాయణలో గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి - మైలవరం : స్థానిక నారాయణ స్కూల్లో శనివారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఈ ఛాంప్స్ విద్యార్థులతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు రత్నకుమారి మాట్లాడుతూ క్రమశిక్షణతో భావిభారత పౌరులుగా విద్యార్థులను తీర్చి దిద్దుతున్నామన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల పై ప్రత్యేకమైన శ్రద్ధ కనపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో మ్యూజియం హరీష్, ప్రముఖ గైనకాలజిస్ట్ ఇందిరా ప్రియదర్శిని, ఆర్ ఐ గురు ప్రసాద్, ఈ చాంప్స్ వైస్ ప్రిన్సిపాల్ మనీషా, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇండియా వేదిక అభ్యర్థిని గెలిపించుకుందాం

ఆత్మీయ సమావేశంల ఇండియా వేదిక నాయకులు

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : మైలవరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఇండియా వేదిక అభ్యర్థిగా బొర్రా కిరణ్ రెడ్డిగూడెం సిపిఎం పార్టీ కార్యాలయంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.వి.ఆంజనేయులు మాట్లాడుతూ దేశంలో ఇండియా వేదిక అధికారంలోకి రావలసిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. మైలవరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ బలపరిచిన ఇండియా వేదిక అభ్యర్థిగా బొర్రా కిరణ్ పోటీ చేస్తున్నారని అన్నారు. ఆయన అభ్యర్థిత్వాన్ని బలపరచాలని కోరారు. బొర్రా కిరణ్ మాట్లాడుతూ ఈ నెల 22న మైలవరంలో తాను నామినేషన్ దాఖలు చేస్తున్నానని కనుక అందరూ కలిసి కట్టుగా ఇండియా వేదిక గెలుపుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మద్దిరెడ్డి మాధవరెడ్డి, కృష్ణారెడ్డి, సుధాకర్, బాబూరావు, అప్పిరెడ్డి, వెంకటరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గొడవర్తి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

22న నామినేషన్, 26న షర్మిల రాక

మాట్లాడుతున్న తాంతియా కుమారి

ప్రజాశక్తి - తిరువూరు : ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఈనెల 26న తిరువూరు విచ్చేస్తున్నట్లు ఇండియా వేదిక తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి తాంతియా కుమారి తెలిపారు. శనివారం తిరువూరులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వేదిక ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 26న షర్మిల ఎన్నికల ప్రచారం నిమిత్తం వస్తున్నందున జనసమీకరణలో తమ పార్టీతో పాటు సిపిఎం, సిపిఐ శ్రేణులు సహకరించాలని కోరారు. ఈ నెల 22న నామినేషన్ కూడా వేయనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్ర్యమంలో సిపిఎం నేతలు సానికొమ్ము నాగేశ్వరరెడ్డి, గుళ్లపల్లి వెంకటరత్నం, మేకల నాగేంద్ర ప్రసాద్, సాంబారు వెంకటేశ్వర్లు, సిపిఐ నాయకులు ఎం.ఉదయ్, నాగుల్ మీరా, కాంగ్రెస్ పార్టీ నాయకులు మేడా సురేష్, పల్లెపాటి శ్రీనివాసరావు, లక్ష్మీదాస్, జీవన్ బాబు, పిడపర్తి లక్ష్మీకుమారి, ఉయ్యూరు అనసూయ, దారా మాధవి, బొడ్డు ప్రకాశరావు, తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్‌కు తరలి రావాలి : ఎంఎల్‌సి అరుణ్

ప్రజాశక్తి - నందిగామ : 24న వైసిపి నందిగామ అభ్యర్థి మొండితోక జగన్ మోహన్ రావు నామినేషన్‌కు తరలి రావాలని ఎంఎల్‌సి మొండితోక అరుణ్‌కుమార్ పిలుపునిచ్చారు. నందిగామలో ఈ నెల 24 (బుధవారం)న మొండితోక జగన్ మోహన్‌రావు నామినేషన్ కార్యక్రమమే విజయానికి సూచికన్నారు. నామినేషన్ కార్యక్రమానికి ప్రతి గ్రామం నుండి, ప్రతి వార్డు నుండి వైసిపి శ్రేణులు పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు. దాదాపు 25 వేల మందితో భారీ ర్యాలీగా... నామినేషన్ వేయబోతున్నామని తెలిపారు.

మట్టి తరలిస్తున్న లారీ స్వాధీనం

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండల పరిధి లోని జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలపై అధికార యంత్రాంగం ఉక్కు పాదం మోపుతున్నారు. రెడ్డిగూడెం నుంచి గణపవరం, మైలవరం ప్రాంతాలకు మట్టి తరలిస్తున్న విషయం తెలుసుకున్న అధికారులు వెంటనే అందుబాటులో ఉన్న లారీని స్వాధీనం చేసుకున్నారు.

మూడో రోజూ పలువురు నామినేషన్లు

వైసిపి అభ్యర్థి నామినేషన్

ప్రజాశక్తి - మైలవరం : వైసిపి మైలవరం నియోజకవర్గ అభ్యర్థి సర్నాల తిరుపతిరావు శనివారం అట్టహాసంగా తన నామినేషన్‌ను మైలవరంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్‌కు అందచేశారు. ముందుగా ఇబ్రహీంపట్నం నుండి వైయస్‌ఆర్సీపీ విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ (నాని) రాజ్యసభ సభ్యులు అయోధ్య రామిరెడ్డి నియోజకవర్గ పరిశీలకులు కర్ర హర్షవర్ధన్ రెడ్డి, అప్పుడే కిరణ్ కుమార్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణ రెడ్డి, జేష్ట శ్రీనాథ్, జోగి రాములుతో భారీ ర్యాలీగా తీన్మార్‌తో కొండపల్లి, జికొండూరు, వెంకటాపురం మీదగా మైలవరం చేరుకున్నారు. స్థానిక పంచాయతీ సెంటర్‌వద్ద వైసిపి కార్యకర్తలు, నాయకులు ఏర్పాటు చేసిన భారీ గజమాలతో కేశినేని నాని, అయోధ్య రామిరెడ్డి తిరుపతిరావులను సత్కరించారు. అనంతరం తిరుపతిరావు నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారికి అందజేశారు.

మైలవరం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి శనివారం ముగ్గురు నామినేషన్లు వేసినట్లు రిటర్నింగ్ అధికారి జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్ తెలిపారు. వైసిపి నుండి సర్నాల తిరుపతిరావు, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ నుండి గుడిసె రాంబాబు, తెలుగు రాజ్యాధికార సమితి పార్టీ నుండి చింతమాలనవీన్ అంబేద్కర్ తమ నామినేషన్‌లు అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు.

పశ్చిమలో మూడో రోజు ఐదు నామినేషన్లు దాఖలు

ప్రజాశక్తి , భవానిపురం : పశ్చిమలో మూడో రోజు శనివారం ఐదు నామినేషన్లు దాఖలు చేశారు. జై భీమ్ రావు భారత్ పార్టీ నుండి పరసా సురేష్ కుమార్, స్వతంత్ర అభ్యర్థులుగా బొబ్బిలి లక్ష్మి ,షేక్ రబ్బాని, జగదీష్ రామచంద్రరావు, నక్కల సాయిబాబు భవానీపురంలోని పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ ఈ కిరణ్మయికి తమ నామినేషన్లు దాఖలు చేశారు.

తిరువూరులో 3 నామినేషన్లు

ప్రజాశక్తి - తిరువూరు : మూడో రోజు శనివారం తిరువూరు నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థులుగా మూడు నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి మాధవి తెలిపారు. బీఎస్పీ నుండి లక్కెపోగు వందన కుమార్, గంగవరపు శామ్యూల్ దేవ సహాయం, ఇండి పెండెంట్ అభ్యర్థిగా లాము ప్రసన్నకుమార్ నామినే షన్లు వేశారని చెప్పారు.

మైలవరంలో నామినేషన్‌ను అందజేస్తున్న తిరుపతిరావు

తిరువూరులో నామినేషన్ అందజేస్తున్న వందనకుమార్

ప్రచారాలు, కరపత్రాలు పంపిణీ

వసంత కుటుంబీకుల ప్రచారం

ప్రజాశక్తి - మైలవరం : మైలవరం నియోజకవర్గం టిడిపి కూటమి అభ్యర్థి విజయాన్ని కాంక్షిస్తూ వసంత కష్ణ ప్రసాద్ సతీమణి శిరీష, తనయుడు దేమంత్ సాయిలు శనివారం విస్తతంగా ప్రచారం చేశారు. జి.కొండూరు మండలంలో ఇంటింటికి తిరుగుతూ సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి స్పష్టంగా కనబడుతుంది : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణంలో రైతు పేట, ఏరియాలో వైసిపి నాయకులతో కలిసి ఎంఎల్ఎ జగన్మోహన్‌రావు గడపగడపకూ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఐదేళ్ల పాలనలో నందిగామను ఎంతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. నందిగామకు రెవెన్యూ డివిజన్ సాధించామని తెలిపారు.

నందిగామలో ప్రచారంలో సౌమ్య

ఎన్డీయే కూటమి సౌమ్య ప్రచారం

ప్రజాశక్తి - నందిగామ : ప్రతి వర్గం గురించి ఆలోచించే వ్యక్తి చంద్రబాబు అని, మంచి సంక్షేమ పథకాలతో ఆయన మనకు అండగా నిలుస్తారు అని నందిగామ నియోజకవర్గ ఎన్డీయే కూటమి ఉమ్మడి అభ్యర్థి తంగిరా సౌమ్య పేర్కొన్నారు. శనివారం ఉదయం నందిగామ పట్టణం 18,16వ వార్డులలో టీడీపీ-జనసేన-బీజేపీ నేతలతో కలసి ఇంటింటికీ తిరిగి సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ ప్రచారం చేశారు.

ఎంపిగా చిన్నిని, ఎంఎల్‌గా నన్ను గెలిపించండి : శ్రీరాం రాజగోపాల్

ప్రజాశక్తి - వత్సవాయి : సైకిల్ గుర్తుపై తమ అమూల్యమైన ఓట్లు వేసి గెలిపించాలని జగ్గయ్యపేట కూటమి అభ్యర్థి శ్రీరాం రాజగోపాల్ తాతయ్య ప్రజలను కోరారు. కంభంపాడులో టిడిపి, బిజెపి, జనసేనల కార్యకర్తలతో ఆయన ప్రచారం నిర్వహించారు. ఎంపిగా కేశినేని చిన్నిని, ఎంఎల్‌గా తనను గెలిపించాలని కోరారు.

వసంత ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్ ప్రాంతంలో నిర్వహించిన టిడిపి ఇంటింటి ప్రచారానికి విచ్చేసిన వసంత వెంకట కృష్ణ ప్రసాద్‌కు అంగరంగ వైభవంగా స్థానిక టిడిపి నేతలు డప్పులతో ఘనంగా శనివారం స్వాగతం పలికారు. ప్రచారంలో వసంత తనయుడు దేమంత్ సాయి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. స్థానిక నేతలు కలిసి సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను ఇంటింటికి అందజేసి ఎమ్మెల్యే అభ్యర్థికి పార్లమెంట్ అభ్యర్థికి ఓట్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక టిడిపి నేతలు బొర్రా ప్రవీణ్, చల్ల వెంకట్రావు గౌర శ్రీనివాసరావు వడ్డే అనిత పాల్గొన్నారు.

నానికి మద్దతుగా ప్రచారం

ప్రజాశక్తి - కంచికచర్ల : నందిగామ వైసిపి అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు, విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని నానికి మద్దతుగా పట్టణ వైసిపి ఆధ్వర్యంలో శనివారం కంచికచర్లలో నాయకులు, కార్యకర్తలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టణ వైసిపి అధ్యక్షుడు వేమా సురేష్ బాబు, ఎంపిటిసి వేమా రోజారమణి, సొసైటీ అధ్యక్షుడు కాలవ పెదబాబు కార్యకర్తలతో కలిసి స్థానిక వసంత కాలనీలో ఇంటింటికీ తిరిగి వైసిపి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. గడిచిన 5 ఏళ్లల్లో వైసిపి ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గురవయ్య, ఆదిత్య, ఏఎంసి వైస్ ఛైర్మన్ మాడూగుల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అబద్దాలతో కాలం వెళ్లదీస్తారు : స్వామిదాస్

ప్రజాశక్తి - గంపలగూడెం: ఎన్నికలు వచ్చినప్పుడల్లా అబద్దాలతో కాలం వెళ్ళదీసి, ప్రజలను మభ్యపెడతారని ప్రతిపక్షాలను ఉద్దేశించి, తిరువూరు నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి నల్లగట్ల స్వామి దాసు పేర్కొన్నారు. శనివారం దాస్ తన ఎన్నికల ప్రచారంలో భాగంగా కనుమూరు, అనుముల్లంక, వినగడప, కొత్తపల్లి, గ్రామాలు పర్యటించి, ఓట్లు అభ్యర్థించారు. ఆయా గ్రామాల్లో పర్యటించిన ఆయన మాట్లాడుతూ, బిజెపితో పొత్తు పెట్టుకోవడం మహా పాపం అన్న బాబు నేడు ఎన్నికలు వచ్చేసరికి బిజెపితో జతకట్టడాన్ని విమర్శించారు. గత ఎన్నికల్లో స్త్రీలకు బంగారం ఇప్పిస్తా..? రైతులకు రుణమాఫీ చేస్తా..? యువకులకు నిరుద్యోగ భృతి ఇస్తా..? ఇలా అనేక మాటలు చెప్పి చేసింది ఏంటి అని ప్రశ్నించారు. కనుమూరు గ్రామంలో తన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పురవీధుల్లో పర్యటిస్తూ ప్రసంగించారు. 30 ఏళ్లుగా ఈ నియోజకవర్గంలో 'మీతోనే ఉంటున్న నన్ను' ఆదరించండి అని కోరారు. విజయవాడ ఎంపి అభ్యర్థి కేశినేని (నాని) శ్రీనివాస్‌కి, తనకు ఫ్యాను గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు.

గంపలగూడెంలో స్వామిదాస్ ప్రచారం

విజయవాడ 2వ డివిజన్‌లో గద్దె అనురాధ ప్రచారం

గద్దె విజయాన్ని కోరుతూ అనూరాధ ప్రచారం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : విజయవాడ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి గద్దె రామమోహన్ విజయాన్ని కోరుతూ మాజీ జిల్లా ఫరిషత్ చైర్మన్ గద్దె అనూరాధ శనివారం 2వ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి టిడిపికి ఓటు వేయాల్సిందిగా అభ్యర్థించారు. ఈ సందర్భంగా అనూరాధ మాట్లాడుతూ టిడిపిలో ఉన్న సమయంలో ఈ ప్రాంతంలో మంచినీటి సమస్యగా ఉందని, రిజర్వాయర్ ఒకటి నిర్మాణం చేయాలని స్థానికులు కోరారన్నారు. దీనితో శాసన సభ్యులు గద్దె రామమోహన్ వెంటనే స్పందించి రెండు రిజర్వాయర్లు నిర్మాణం చేయడానికి నిధులు మంజూరు చేయించారని చెప్పారు. 15వ డివిజన్ రామలింగేశ్వరనగర్ కృష్ణవేణి రోడ్డు వద్ద నుండి గద్దె రామమోహన్ శనివారం సాయంత్రం విస్తృతంగా పర్యటించారు.

జిల్లా జడ్జి శ్రీనివాసరావుకు సన్మానం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ ప్రజలు, న్యాయవాదులు సహకారంతో మెరుగైన సేవలందించినట్లు కృష్ణా జిల్లా నందిగామ 16వ అదనపు న్యాయస్థానం జిల్లా జడ్జి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. నందిగామ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నందిగామ 16వ అదనపు జిల్లా జడ్జి వి.శ్రీనివాసరావు బదిలీ, వీడ్కోలు సభ శుక్రవారం రాత్రి నందిగామ కోర్టులు సముదాయం ఆవరణలో ఘనంగా నిర్వహించారు. నందిగామ బార్ అసోసియేషన్ అధ్యక్షులు నంద్రు బాబు విద్యాసాగర్ అధ్యక్షుతన జరిగిన కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి వి.లక్ష్మీ రాజ్యం, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రియాజ్, జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు అన్నపాక సుందరరావు, నందిగామ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అద్దంకి మణిబాబు, జాయింట్ సెక్రెటరీ ఎక్కిరాల హనుమంతరావు, తదితరులు జిల్లా జడ్జి శ్రీనివాసరావు సేవలను కొనియాడారు. న్యాయవాదులు కొరగంటి కృష్ణంరాజు, లైబ్రేరియన్ ఆనందం, విజయ భాస్కర్, ట్రెజరర్ చార్టర్గడ్డ రవికుమార్, సీనియర్ జూనియర్ న్యాయవాదులు జడ్జి ఆలోచన విధానాలు కొనియాడారు. అనంతరం శ్రీనివాసరావు దంపతులను సన్మానించారు.

శ్రీనివాసరావు దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

గడపగడపకూ తిరుగుతూ ప్రచారాలు

మండలి బుద్ధ ప్రసాద్‌కు మద్దతుగా మాట్లాడుతున్న వక్తలు

బుద్ధ ప్రసాద్‌కు మద్దతు

ప్రజాశక్తి - అవనిగడ్డ : అవనిగడ్డ జనసేన పార్టీ అభ్యర్థి మండలి బుద్ధ ప్రసాద్‌కు అఖిలభారత చిరంజీవి యువత మద్దతు తెలుపుతున్నట్లు ఆ సంస్థ అధ్యక్షులు రవణం స్వామి నాయుడు తెలిపారు. శనివారం అవనిగడ్డ అసెంబ్లీ అభ్యర్థి బుద్ధ ప్రసాద్ ఇంటికి వచ్చిన స్వామి నాయుడు బుద్ధ ప్రసాద్ అభినందించి జనసేన పార్టీ గాంధీ క్షేత్రంలో ఏర్పాటు చేసిన మెగా అభిమానుల ఆత్మీయ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అభిమానుల ఉద్దేశించి స్వామి నాయుడు మాట్లాడుతూ మెగాస్టార్ చిరంజీవి అత్యంత ఇష్టపడే వ్యక్తులలో మండలి బుద్ధ ప్రసాద్ ఒకరని అవనిగడ్డ నియోజకవర్గంలో ఎన్డీఏ కూటమి అభ్యర్థి మండలి బుద్ధ ప్రసాద్ ని గెలిపించాలని కోరారు. బుద్ధ ప్రసాద్‌తో తమకు ప్రత్యేక అనుబంధం ఉందని అవనిగడ్డ నియోజకవర్గంలో ఏదైనా అభివృద్ధి జరిగింది అంటే బుద్ధ ప్రసాద్ హయాంలోనే జరిగిందని అన్నారు. ప్రతి ఒక్కరు గాజు గ్లాసు గుర్తుపై తమ అమూల్యమైన ఓటు వేసి మచిలీపట్నం పార్లమెంటు అభ్యర్థిగా వల్లభనేని బాలశౌరి అవనిగడ్డ నియోజకవర్గ అభ్యర్థిగా మండలి బుద్ధ ప్రసాదును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ తనకు మద్దతుగా అఖిల భారత చిరంజీవి యువత బృందాన్ని పంపినందుకు చిరంజీవికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత చిరంజీవి యువత సభ్యులు సుగుణ బాబు ఎల్ శ్యాంబాబు రవీంద్రబాబు అనిల్ విష్ణు కొరియర్ శ్రీను బాదర్లలో లాక్ష్మనాయుడు జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మతి వెంకటేశ్వరరావు పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రాయిపూడి వేణుగోపాలరావు, లీగల్ సెల్ కన్వీనర్ బాసు నాంచారయ్య నాయుడు పాల్గొన్నారు

కప్పలదొడ్డిలో శంఖారావం

ప్రజాశక్తి - గూడూరు : గూడూరు మండలం కప్పలదొడ్డిలో శంఖారావం సూపర్ సిక్స్ పథకాలను పెడన నియోజకవర్గం టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాగిత కృష్ణ ప్రసాద్ సతీమణి కాగిత శిరీష శనివారం ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రజలందరూ సైకిల్ గుర్తుపై ఓటు వేసి కాగిత కృష్ణ ప్రసాద్ కి, పార్లమెంట్ అభ్యర్థి బాలసౌరి కి గాజు గుర్తుపై పై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.

పులిగడ్డలో టిడిపి జనసేన ప్రచారం

ప్రజాశక్తి - అవనిగడ్డ : అవనిగడ్డ నియోజకవర్గం జనసేన పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మండలి బుద్ధ ప్రసాద్‌ను మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జనసేన పార్టీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరిని గెలిపించాలని కోరుతూ మండల పరిధిలోని పులిగడ్డ గ్రామంలో కూటమి నాయకులు ప్రచారం నిర్వహించారు. బాలశౌరి బుద్ధ ప్రసాద్ ల ఎన్నికల గుర్తు గాజు గ్లాస్ అని గాజు గ్లాస్ గుర్తుపై ఓట్లు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. బుద్ధ ప్రసాద్ సతీమణి మండలి విజయలక్ష్మి జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు

టిడిపితోనే గ్రామాభివృద్ధి : రాజేశ్వరరావు

ప్రజాశక్తి - హనుమాన్ జంక్షన్ : టిడిపితోనే గ్రామాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన సాధ్యమని మండల అధ్యక్షులు దయ్యాల రాజేశ్వరరావు అన్నారు. టిడిపి టౌన్ అధ్యక్షుడు అట్లూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రమైన బాపులపాడులోని కె.ఎస్.టాకీస్ ప్రాంతంలో గడపగడపకు ప్రజాగళం పేరుతో నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో స్థానిక నాయకులతో కలిసి ఆయన పాల్గొన్నారు. రాజేశ్వరరావు మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో అభివృద్ధి జాడ లేకుండాపోయిందని, సహజ వనరుల దోపిడీ యథేచ్ఛగా సాగిందని ఆరోపించారు. కూటమి గన్నవరం అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావుకు సైకిల్ గుర్తుపై, బందరు పార్లమెంట్ అభ్యర్థి బాల శౌరికి గాజుగ్లాసు గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు.

దళితుల అభివృద్ధికి టిడిపి కట్టుబడి ఉంది: కొల్లు

ప్రజాశక్తి - మచిలీపట్నం రూరల్ : దళితుల అభివృద్ధి కోసం నిరంతరం కష్టపడే వ్యక్తి చంద్రబాబునాయుడు అని కొల్లు రవీంద్ర అన్నారు. శనివారం మచిలీపట్నం మండలం పెదయాదర, చినయాదర దళిత వాడలో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో ఎన్డీయే కూటమి ఎమ్మెల్యే కొల్లు రవీంద్ర, ఎంపి అభ్యర్థి వల్లభనేని బాలశౌరి జనసేన ఇంచార్జి బండి రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొల్లు రవీంద్ర మాట్లాడుతూ దళితుల అభ్యున్నతి కోసం నిరంతరం కష్టపడే వ్యక్తి చంద్రబాబు అన్నారు. తెదేపా హయంలో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో వాడ వాడలా సి.సి.రోడ్ల నిర్మాణం చేశామన్నారు. వల్లభనేని బాలశౌరి మాట్లాడుతూ దళిత లను నమ్మించి నట్టేటా ముంచిన వ్యక్తి జగన్ మోహన్ రెడ్డి.ఇళ్ల స్థలాల పేరుతో ఎస్సీ లకు చెందిన 11,000 ఎకరాల ను స్వాధీనం చేసుకున్నారని, ప్రధాన మంత్రి ఆదర్శ గ్రామ యోజన నిధులను దారి మళ్లించారు. బండి రామకృష్ణ మాట్లాడుతూ తెలుగుదేశం జనసేన బిజెపి ఉమ్మడి ప్రభుత్వం మీ లక్ష్యంగా ప్రతి ఒక్కరు పని చేయాలి.జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ అధ్యక్షతన ఎన్నో సేవా కార్యక్రమాలు సొంత నిధులతో దళితుల కోసం చేయగలిగామన్నారు.

రైతుల సంక్షేమం కోసం వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం : కిట్టు

ప్రజాశక్తి - మచిలీపట్నం రూరల్ : రైతుల సంక్షేమం కోసమే వైసిపి ఎంతో పాటుపడుతోందని, గత పాలకులు కేవలం వారి ప్రయోజనాల కోసం ఆలోచించి, రైతులు మహిళలు, నిరుపేదల సమస్యలను గాలికి వదిలేసి, పాలన సాగించారని వైసిపి మచిలీపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) పేర్కొన్నారు. శనివారం ఆయన మచిలీపట్నం మండలంలోని ఎస్.ఎన్.గొల్లపాలెం గ్రామంలో గడప గడపకు మన సంక్షేమం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిట్టు మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు రైతన్నల కోసం చేసిన అభివృద్ధి ఏమిటనేది, మీరే ఆలోచించాలని ఆయన అన్నారు. ఇదే సందర్భంలో ఆహార ధాన్యాలు కొనుగోలు విషయంలో కూడా జగనన్న ప్రభుత్వం రైతులకు అండగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఇంచార్జి మట్టా మోహన సంచారయ్య, తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రి తనయుడి ప్రచారం

ప్రజాశక్తి - కోడూరు : కోడూరులోని 1వ వార్డులో అవనిగడ్డ నియోజకవర్గం ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు తనయుడు యువ నాయకుడు వికాస్ శనివారం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ప్రతి గడపకు వెళ్లి వైసిపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అందించిన సంక్షేమ అభివృద్ధి పథకాలు గురించి ప్రజలకు వివరిస్తూ తమ అమూల్యమైన రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి మచిలీపట్నం పార్లమెంట్ వైసిపి అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావుని, అవనిగడ్డ నియోజకవర్గం వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి సింహాద్రి రమేష్ బాబుని, అఖండ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు.

అవకాశం ఇవ్వండి ...అభివద్ధి చేస్తా

ప్రజాశక్తి - పెడన : ఒక్కసారికి అవకాశం ఇస్తే అభివద్ధి చేసి చూపిస్తామంటూ వైసిపి శాసనసభ అభ్యర్థి ఉప్పాల రాము ప్రజలను విజ్ఞప్తి చేశారు. పట్నంలోని 22, 23 వార్డుల్లో జిల్లా పరిషత్ చైర్మన్ ఉప్పాల హారికతో కలిసి శనివారం పర్యటించారు. గడపగడప సందర్శిస్తూ ప్రభుత్వ నుంచి వచ్చిన సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. పట్టణంతోపాటు రూరల్ ప్రాంతాల్లోని అవసరమైన తాగునీరు, డ్రైనేజీ, రోడ్డు వంటి మౌలిక సౌకర్యాలు పూర్తిస్థాయిలో కల్పిస్తామన్నారు.

వైసిపి అభ్యర్థి కైలే ప్రచారం

ప్రజాశక్తి పెదపారుపూడి : వైసిపి పామర్రు ఎంఎల్ఎ అభ్యర్థిగా తనను, మచిలీపట్నం ఎంపి అభ్యర్థిగా సింహాద్రి చంద్రశేఖర్‌ను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కైలే అనిల్ కుమార్ కోరారు. శనివారం ఈ మేరకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ లంచాలకు తావు లేకుండా.. గంటల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా వాలంటరీ వ్యవస్థను జగన్ కల్పించారన్నారు. పెత్తందార్ల పక్షాన నిలిచే చంద్రబాబు అధికారంలోకి వస్తే ఈ రెండు వ్యవస్థలను రద్దు చేస్తారని తెలిపారు. ఏ సమస్య వచ్చినా ఎప్పుడూ అండగా ఉండే తాను భవిష్యత్తులోనూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

నమ్మకం ఉంటే ఓటు వేయండి : వంశీ

ప్రజాశక్తి - గన్నవరం : గన్నవరం పట్టణంలో అభివద్ధి చేయడంతో పాటు అడిగిన వారికి లేదనకుండా సహాయం చేశానని మీకు నమ్మకం ఉంటే మరోసారి ఓటు వేసి గెలిపించాలని వైసిపి అభ్యర్థి వల్లభనేని వంశీ మోహన్ అన్నారు. శనివారం గన్నవరం పట్టణంలోని మదర్ థెరిసా కాలనీలో, బుద్ధవరం రోడ్డు, గౌడ పేట, జగదీశ్వరరావు కాలనీలో విస్తృత ప్రచార కార్యక్రమాన్ని ఆయన చేపట్టారు. ప్రచార రథం పై నిలబడి రెండు చేతులు జోడించి నమస్కారం చేస్తూ ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గన్నవరం నియోజకవర్గ అభివద్ధిలో తన పాత్ర కీలకమైందన్నారు. కోట్లాది రూపాయలు పేదలకు సహాయంగా అందించినట్లు గుర్తు చేశారు.

బి ఫారం అందుకున్న శ్రీరామ్‌మూర్తి

బీఫారం అందుకుంటున్న శ్రీరామ్మూర్తి

ప్రజాశక్తి - అవనిగడ్డ : అవనిగడ్డ అసెంబ్లీ నియోజకవర్గం ఇండియా వేదిక బలపరిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అందె శ్రీరామ్ మూర్తి పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి చేతుల మీదుగా బీఫారం అందుకున్నట్లు తెలిపారు. శ్రీరామ్ మూర్తిని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అవనిగడ్డ అభ్యర్థిగా ప్రకటించడంతో శుక్రవారం కర్నూల్‌లో షర్మిల శ్రీరామ్ మూర్తికి బి.ఫారం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మూర్తి విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 24వ తేదీ అవనిగడ్డలో నామినేషన్ దాఖలు చేయనున్నట్లు తెలిపారు.

26 నుండి సమ్మర్ క్యాంప్

ప్రజాశక్తి - తిరువూరు : వేసవిలో విద్యార్థులకు విజ్ఞానంతో పాటు, వినోదాన్ని అందించేందుకు జనవిజ్ఞాన వేదిక (జెవివి) ఆధ్వర్యంలో ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని తిరువూరులోని స్థానిక సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏప్రిల్ 26 నుండి ప్రారంభిస్తున్నట్లు జనవిజ్ఞానవేదిక జిల్లా ప్రధానకార్యదర్శి ఎల్.గంగాధర్ తెలిపారు. దానిలో భాగంగా స్పోకెన్ ఇంగ్లిష్, ఫన్నీ మ్యాథ్స్, సైన్స్ ప్రయోగాలు, ఇంద్రజాల ప్రదర్శన తదితర అంశాల్లో శిక్షణ ఇస్తామన్నారు. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో ఆరు నుండి 9 వరకు చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. శుక్రవారం రాత్రి తిరువూరు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన జనవిజ్ఞాన వేదిక మండల కమిటీ సమావేశంలో అధ్యక్షుడు ఎం.సుధాకర్, ప్రతి నిధులు ఎం.హరికృష్ణ, ఎం.రాంప్రదీప్, డి.సుదర్శన్, ఎస్‌డి.సుభానీ తదితరులు పాల్గొన్నారు.

జాతర మహోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ, మండలం అంబారుపేట గ్రామంలో శ్రీ సత్యమ్మ అమ్మ వారి ఆలయ జాతర మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ఇఒ పామర్తి సీతారామయ్య పర్యవేక్షణలో పలు పూజలు నిర్వహించారు. జాతరలో 24న బుధవారం 2వేల మందికి వంట చేసేందుకు వంట మనిషి, పనిమనుషులు, షామియానా ఏర్పాటుకు 21న 11 గంటల లోపు కొటేషన్ అందజేయాలని ఈవో సీతారామయ్య తెలిపారు. కొటేషన్ చేసినవారు పూర్తి బాధ్యత వహించాలని, దేవస్థానానికి ఎటువంటి సంబంధం ఉండదని దీనికి అంగీకరించిన వారు మాత్రమే కొటేషన్లు ఆలయ కార్యాలయంలో అందజేయాలని ఈవో తెలిపారు.

కారు ఢీకొని విఆర్ఒ మృతి

బంటుమిల్లి : కారు ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలో శనివారం చోటుచేసుకుంది. బంటుమిల్లి మండలం చొరంపూడి గ్రామంలో విఆర్ఓగా పని చేస్తున్న సమ్మెట వీర ప్రసాద్ (61) బందరు నుండి తన మోటార్ సైకిల్‌పై ఉద్యోగం నిమిత్తం బంటుమిల్లి మండలం కొర్లపాడు గ్రామానికి వస్తున్నారు. వెనుక నుండి కారు వేగంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందారు.

దుర్గగుడిలో రావణ వాహన ఊరేగింపు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గగుడిలో ఈ నెల 19వ తేదీ నుండి 27 వరకు జరుగు శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల బ్రహ్మోత్సవ కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి అమ్మవార్ల రావణ వాహన ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో కె ఎస్ రామరావు ఊరేగింపును ప్రారంభించారు. ఈ ఊరేగింపు శనివారం సాయంత్రం శ్రీ మల్లిఖార్జున మహా మండపం నుండి బయలుదేరి కనకదుర్గా నగర్, రథం సెంటర్, బ్రాహ్మణవీధి, శ్రీనివాసమహల్, కోమలా విలాస్ సెంటర్, సామారంగం చౌక్, మెయిన్ రోడ్, ఐరన్ సెంటర్, రథం సెంటర్ మీదుగా మహా మండపానికి చేరింది.

జర్నలిస్ట్ రామకృష్ణకు నివాళి

ప్రజాశక్తి - పెదపారుపూడి మండలం (పామర్రు) : సీనియర్ పాత్రికేయుడు, పెదపారుపూడి మండల ఈనాడు రిపోర్టర్, పి.రామకృష్ణ (39) శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. రామకృష్ణకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. శనివారం పెదపారుపూడిలోని రామకృష్ణ స్వగ్రహంలో ఆయన భౌతికకాయాన్ని పలువురు సందర్శించి నివాళులర్పించారు.

టిడ్కో ఇళ్ల రుణమాఫీ ప్రకటించాలి

సమావేశమైన సభ్యులు

ప్రజాశక్తి - గుడివాడ : టిడ్కో ఇళ్ల రుణమాఫీ ప్రకటించకపోతే పోరాటం మరింత ఉధృతం చేస్తామని టిడ్కో అభివద్ధి కమిటీ కార్యదర్శి బసవ అరుణ పేర్కొన్నారు. టిడ్కో కాలనీ అభివద్ధి కమిటీ సమావేశ తీర్మానం స్థానిక సి.పి.ఎమ్.కార్యాలయంలో శనివారం సంఘ అధ్యక్షురాలు సంగమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ ఎన్నికల ముందు టిడ్కో లబ్ధిదారుల ఓట్ల కోసం రాజకీయ పార్టీలు ఋణమాఫీ గురించి మొక్కుబడిగా నామ మాత్రంగా మాట్లాడి సమస్యను దాటి వేయటానికి ప్రయత్నిస్తూ ఉన్నాయని విమర్శించారు. ఎన్నికల ముందే ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టి ఋణమాఫీ ప్రకటించాలని కోరారు. లేనిపక్షంలో తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడ్కో కాలనీ అభివద్ధి కమిటీ ఉపాధ్యక్షులు ఆర్.దుర్గ, నూరున్నిసా, సహాయ కార్యదర్శులు గౌస్ పీరా, ఆదినారాయణ, కమిటీ సభ్యులు శివరాం ప్రసాద్ పాల్గొన్నారు.

టీచర్ సస్పెన్షన్

ప్రజాశక్తి - బంటుమిల్లి : విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయుడు విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో డిఇఒ సదరు ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేశారు. బంటుమిల్లి మండలం నెహ్రూ నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జిటిగా పనిచేస్తున్న బి.రామానందసాగర్ విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు గ్రామస్తులు తల్లిదండ్రులు తెలిపారు. విద్యార్థిని ఏడుస్తూ పాఠశాల నుండి ఇంటికి వెళ్లడంతో తల్లిదండ్రులు విచారించగా టీచర్ చేసిన వికృత చేష్టలు తల్లిదండ్రులకు వివరించింది. దీంతో తల్లిదండ్రులు ఆ టీచర్‌కు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పాఠశాలలో పనిచేసే ఆయాతో కూడా అసభ్యంగా ప్రవర్తించడంతో పోలీసులకు ఫిర్యాదు అందించిందని తెలిపారు. వెంటనే బంటుమిల్లి ఎంఇఒ తాహెరా సుల్తానా ఆ టీచర్‌ను సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

2 వేల మందికి అన్న ప్రసాదం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా కొత్తపేటలోని శ్రీ నగరాల సీతారామ స్వామి వారి దేవ స్థానం వద్ద శనివారం మధ్యాహ్నం రెండు వేల మందికి అన్న ప్రసాద వితరణ జరిగింది. శ్రీ నగరాల సీతారామస్వామి శ్రీ మహాలక్ష్మి అమ్మవార్ల దేవస్థానం కమిటీ అధ్యక్షులు లింగి పిల్లి అప్పారావు, కార్యదర్శి మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు (పిసి), గౌరవ అధ్యక్షులు బెవర సూర్యనారాయణ, ఉపాధ్యక్షులు బెవర శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కొరగంజి భాస్కరరావు తదితరులు అన్నదానం ఏర్పాట్లను పర్యవేక్షించారు. అన్న ప్రసాదాన్ని స్వీకరించడానికి వచ్చిన వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చక్కటి ఏర్పాట్లు చేశారు. కాగా శ్రీరామ ఉత్సవాల ముగింపు సందర్భంగా శనివారం సాయంత్రం శ్రీ స్వామివారి పవళింపు సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కమిటీ సభ్యులు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

అనిల్ వంశీ జ్ఞాపకార్థంగా చలివేంద్రం

ప్రజాశక్తి - భవానీపురం : సిపిఎం సీనియర్ నాయ కులు కుండా నాల అనిల్ వంశీ మూడో వర్ధంతి జ్ఞాపకార్థం సందర్భంగా 44వ డివిజన్ బిటిఆర్ భవన్ వద్ద స్థానిక పెద్దలు గంధం అంజిబాబు సహకారంతో శనివారం సిపిఎం ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఐద్వా అధ్యక్షురాలు కుందనాల శేషమని, సిపిఎం ఫ్లోర్ లీడర్, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు, ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ఇబ్బందుల్లో ఉన్న ప్రజలకు సహాయ సేవా కార్యక్రమాలు అందించడం వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం భాస్కరరావు, అనిల్ వంశీ గొప్పతనమని తుది శ్వాస విడిచే వరకు కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు ఎస్.సుబ్బారెడ్డి, డివిజన్ నాయకులు ఏ.సుదర్శన్, విక్రమ్ లక్ష్మి, ప్రసాదు, రమణ, ఎస్ఎఫ్ఐ నాయకురాలు కె.ఎస్.ఎస్.విని పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్ ఆస్తుల వివరాలు బయట పెడతా

వైసిపి నేత పోతిన మహేష్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పవన్ కళ్యాణ్ ఆస్తుల వివరాలు బయట పెట్టకపోతే తాను బయట పెడ తానని వైసిపి నాయ కులు పోతిన మహే ష్ అన్నారు. జన సేన పార్టీ జెండా, ఎజెండా ఏంటో పవన్ చెప్పాలన్నారు. శని వారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబును సిఎం చేయడం కోసమే పవన్ కళ్యాణ్ పార్టీ పెట్టారా అని ప్రశ్నించారు. కాపు యువతను, వీర మహిళలను, జన సైనికులను టీడీపీకి జెండా కూలీలుగా మార్చారని ఆవేదన వ్యక్తంచేశారు. ఉమ్మడి పది జిల్లాలో జనసేన పార్టీ లేదని విమర్శించారు. నమ్ముకున్న వాళ్ళని జెండా కూలీలుగా మార్చి ప్యాకేజ్ తీసుకున్నారని మండి పడ్డారు. రాజమండ్రి జైల్లో చంద్రబాబును కలిసాకా ఎక్కడెక్కడ ఆస్తులు కొన్నది పవన్ కళ్యాణ్ చెప్పాలని డిమాండ్ చేశారు. పవన్ కళ్యాణ్ చంద్రబాబుతో మిలాకత్ అయ్యి పార్టీని తాకట్టుపెట్టారన్నారు. పార్టీ కోసం ఫండ్ సేకరించి పవన్ ఎందుకు బయట పెట్టడం లేదని, జనసేన పార్టీ కార్యాలయం స్థలం కొనుగోలు చేయడానికి డబ్బులు ఎక్కడ నుంచి వచ్చాయో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ కోసం ఎలక్టోరల్ బాండ్స్ ద్వారా సేకరించిన నిధుల వివరాలు బయట పెట్టాలన్నారు. స్కిల్ లేని పవన్ కళ్యాణ్ స్కిల్ డెవలప్మెంట్ కేసు గురించి మాట్లాడతావా అని ప్రశ్నించారు. నాదెండ్ల మనోహర్ 10 కోట్లు ఖర్చు పెట్టి స్పోర్ట్స్ కార్ కొనుగోలు చేసారని తెలిపారు. ఈ డబ్బులు ఏ ఫిల్మ్ ప్రొడ్యూసర్ ఇచ్చారో నాదెండ్ల మనోహర్ చెప్పాలన్నారు.

రాష్ట్రస్థాయి అండర్ -17 చెస్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : పోరంకిలోని గ్రీన్ స్కూల్ నందు రాష్ట్ర స్థాయి అండర్ -17 చెస్ చాంపియన్‌షిప్ పోటీలు శనివారం ఉదయం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను తొలుత ఆంధ్ర చెస్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ రామ సుబ్బారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెస్ క్రీడ వల్ల విజ్ఞానంతో పాటు వికాసం పెరుగుతుందన్నారు. ప్రతి విద్యార్థి ఏదో ఒక క్రీడలో నైపుణ్యాన్ని పెంపొందించు కోవాలన్నారు. గ్రీన్ స్కూల్ ప్రిన్సిపాల్ జె.సాయి అపర్ణ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై కూడా ఆసక్తి పెంచుకోవాలన్నారు. క్రీడల్లో రాణించిన వారికి ప్రభుత్వ పరంగా మంచి ప్రోత్సాహకాలు ఉన్నాయని అన్నారు. తమ పాఠశాలలో విద్యతో పాటు ఆటలకు సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. కృష్ణా జిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటరీ ఎం.ఎం.ఫణి కుమార్ మాట్లాడుతూ కృష్ణా జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అండర్ -17 చెస్

పోటీలకు మంచి స్పందన వస్తుందన్నారు. వివిధ ప్రాంతాల నుండి సుమారు 60 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్నూలు, నంద్యాల చీఫ్ కోచ్ ఇమామ్ హుస్సేన్, పలువురు కోచ్‌లు క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పశ్చిమలో 253 పోలింగ్ కేంద్రాలు : ఎన్నికల అధికారి కిరణ్మయి

మాట్లాడుతున్న అధికారి కిరణ్మయి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పశ్చిమ నియోజకవర్గంలో మొత్తం 253 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కే. కిరణ్మయి తెలిపారు. శనివారం భవానీపురంలోని పశ్చిమ ఆర్.ఒ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి కె.కిరణ్మయి మాట్లాడుతూ ఈ నెల 21 ఆదివారం సెలవు దినం అవడంతో నామినేషన్లు స్వీకరించబడవని, మరల ఈనెల 22 సోమవారం నుండి యధావిధిగా కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈ నెల 25 మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరించబడతాయని ఆమె తెలిపారు. ఈనెల 26 నుండి స్క్రుట్నీ జరుగుతుందని ఆమె తెలిపారు. నామినేషన్ స్వీకరణకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని, నామినేషన్ సమర్పించు అభ్యర్థులు వారితోపాటు నలుగురు మాత్రమే రావాలని కోరారు. ఇప్పటివరకు ప్రధాన పార్టీ అభ్యర్థులు నామినేషన్లు స్వీకరించినట్లు తెలిపారు. పశ్చిమ నియోజకవర్గంలో 97 సమస్యాత్మక పోలింగ్ బూత్‌లను గుర్తించినట్లు తెలిపారు. దీనిపై అధికారులకు నివేదిక పంపామని తెలిపారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన కేసులను నాలుగు నమోదు చేశామని పేర్కొన్నారు. పోలింగ్ బూత్‌లలో సౌకర్యాలపై దృష్టి సారిస్తున్నామని, ఎన్నికల తేదీకి పది రోజులు ముందు నుండే సౌకర్యాలు కల్పించేలా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ జరిగేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

నిందితుడికి రిమాండ్

ప్రజాశక్తి - విస్సన్నపేట : నరసాపురంలో గల శ్రీ సూర్య దేవర లక్ష్మీనారాయణ దేవాలయంలో దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. వివరాల ప్రకారం... గురువారం తెల్లవారుజామున కానుక హుండీ దొంగతనం జరిగిన విషయం తెలిసిందే. ఆ ఘటన జరుగుతుండగా గమనించిన కానిస్టేబుల్ చోరీకి పాల్పడిన వ్యక్తిని వెంబడించగా చాకచక్యంగా పారిపోయాడు. శనివారం ఆ వ్యక్తి నరసాపురం గ్రామ శివారు రోడ్డుపైన అటుగా వెళ్తుండగా స్థానికులు సమాచారం అందించడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చోరీకి పాల్పడిన వ్యక్తి సత్తుపల్లి మండలం లంకపల్లి గ్రామానికి చెందిన మానికల వసంతరావు (36) అని పోలీసులు తెలిపారు. అని వద్ద నుండి రూ.6,100, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని ఫోన్‌ను రికవరీ చేసి కోర్టులో హాజరుపరిచామని తెలిపారు. కోర్టువారు రిమాండ్ విధించారని సిఐ అబ్దుల్ నబీ, ఎస్ఐ జి.రామకృష్ణ తెలిపారు.

అమెజాన్ వినూత్న ప్రచారం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఎప్పటికపుడు సరికొత్త ఉత్పత్తులను అందిస్తున్న అమెజాన్ సరికొత్త క్యాంపెయిన్ ఫ్యాషన్ ఆన్ అమెజాన్ పేరుతో విస్తృతంగా ప్రచారాన్ని కల్పిస్తున్నామని సంస్థ ప్రతినిధి ఆదిత్య రాయ్ కపూర్ ఒక ప్రకటనలో తెలిపారు. అమెజాన్ ద్వారా దుస్తులు, షూస్, వాచీలు, యాక్సరీస్, మొదలైన ఉత్పత్తులను వన్‌స్టాప్ ఆన్‌లైన్ వేదికగా అందిస్తున్నామని తెలిపారు. వినియోగదారులు కోరుకున్న విధంగా సకాలంలో వారికి ఉత్పత్తులను అందించడంలో ముందుంటుందని తెలిపారు.

భానుడి ప్రతాపంతో విలవిల

జిల్లా వ్యాప్తంగా 45 డిగ్రీల ఉష్ణోగ్రత...



ప్రజాశక్తి - కంచికచర్ల : ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా శుక్రవారం భానుడి ప్రతాపానికి ప్రజలు విలవిలాడి పోయారు. జిల్లాలో ఇబ్రహీంపట్నం, కంచికచర్ల మండలాల్లో పగటి పూట ఉష్ణోగ్రత 46 డిగ్రీలకు తాకింది. నందిగామ, జగ్గయ్యపేట, జి కొండూరు, విజయవాడ రూరల్, అర్బన్, విజయవాడ నగరంలో 45 డిగ్రీల పైబడి ఎండ తీవ్రతతో పాటు వడగాల్పులు వేశాయి. ఉదయం 9 గంటల నుండే ప్రతి గంటకు ఎండ తీవ్రత పెరిగింది. మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 వరకు ఎండ తీవ్రత తోపాటు తీవ్ర ఉక్కపోతకు గాలి ఆడక జనం అల్లాడిపోయారు. పగటిపూట జనం బయటకు రాలేక పోయారు. ఈ సమయంలో జన సంచారం లేక ప్రధాన రహదారులు నిర్మానుష్యమయ్యాయి. ఇళ్లల్లో జనం ఉండలేక అల్లాడిపోయారు. ఫ్యాన్లు తిరుగుతున్నా వేడి గాలి వీయటంతో పిల్లలు, వద్ధులు అల్లాడిపోయారు. సాయంకాలం 5 గంటల తర్వాత ఎండ వేడి తగ్గటంతో కొంత ఉపశమనం పొందారు. ఏప్రిల్ నెలలోనే ఎండ తీవ్రత ఇలా ఉంటే మేలో ఎంత తీవ్రంగా ఉంటుందోనని జనం భయాందోళనకు గురౌతున్నారు.

సంతానలేమికి పురుషులు కూడా కారణమే

డాక్టర్ ఎం.సతీష్ రెడ్డి

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : సంతానం కలగకపోవడానికి స్త్రీలల్లో లోపమే కాదు. పురుషుల్లో లోపం కూడా కారణమని ప్రముఖ యాండ్రాలజిస్ట్ డాక్టర్ యం.సతీష్ రెడ్డి అన్నారు. బెంజిసర్కిల్ వద్ద గల వాసవ్య నర్సింగ్ హోమ్‌లో 'పురుషుల్లో వంధత్వానికి కారణాలు' అనే అంశంపై శనివారం ఆరోగ్య సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పెళ్లయినా రెగ్యులర్‌గా దాంపత్య జీవితంలో పాల్గొంటూ ఒక సంవత్సరం దాటినప్పటికీ గర్భం రాకపోతే దంపతులిద్దరూ పూర్తిగా పరీక్ష చేయించుకోవాలన్నారు. గర్భం రాకపోవడానికి మూడింట ఒక వంతు స్త్రీలల్లో లోపాలు కారణమైతే మరొక వంతు పురుషుల్లో లోపాలు, ఇంకొక వంతు ఇద్దరిలోనూ లోపం ఉండటం కారణం అన్నారు. ఆధునిక కాలంలో జీవనశైలిలో వచ్చిన మార్పులు, స్థూలకాయం, ధూమపానం, మద్యపానం, శారీరక శ్రమ లేకపోవడం, మానసిక వత్తిడి, జంక్ ఫుడ్ వంటివి కూడా సంతానలేమికి కారణమన్నారు. మగవాళ్లలో సంతానలేమికి పుట్టుకతో జన్యుదోషాలు, కొంత కారణంకాగా, వృషణాలు సరైన రీతిలో ఉండకపోవడం, వృషనాలకి గాయాలు, వాపులు, వేరికోసీల్ వంటివి సంతానలేమికి కారణాలన్నారు. వీర్యంలో వీర్యకణాలు లేకపోవడం, ఉన్నా తక్కువ ఉండటం కారణాలన్నారు. ఆధునిక వైద్య ప్రగతిలో సంతానలేమి చికిత్సతో మంచి ఫలితాలే కలుగుతాయన్నారు. ఈకార్యక్రమానికి ప్రముఖ వైద్యులు డాక్టర్ జి.సమరం అధ్యక్షత వహించగా డాక్టర్ మారు పాల్గొన్నారు.

కాచవరం, దోనబండల్లో పోలీసు కవాతు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కాచవరం, దోనబండ గ్రామంలో 2024 ఎన్నికల నేపథ్యంలో ఎన్టీఆర్ కమీషనరేట్, పోలీసు కమిషనర్ కాంతి రాణా టాటా ఆదేశాల మేరకు కాచవరం, దోనబండ గ్రామంలో శనివారం ఇబ్రహీంపట్నం పోలీసులు సివిల్, ఏ.ఆర్, పారామిలటరీ బలగాలతో ఫ్లాగ్ మార్చ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం సిఐ ముత్యాల సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజలకు రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును వినియోగించేందుకు నిర్భయంగా భయపక్షపాతాలు లేకుండా ఉండేందుకు పోలీసు వారు ఎప్పుడు ప్రజలకు అండగా ఉంటారని, ప్రజలు ఎటువంటి అపోహలకు గురికావద్దని, ప్రతి ఒక్కరికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత పోలీసు వారిదేనని తెలియజేస్తూ నిర్భయంగా ప్రజలందరూ వారి ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచిం చారు. కార్యక్రమంలో ఎస్ఐ పాపారావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.